పరమమ్

(శ్రీ మధునాపంతుల వేంకట పరమయ్య సాహిత్య జీవితం)



అవధానుల మణిబాబు



స్వర్గీయ శ్రీ మధునాపంతుల వేంకట పరమయ్యగారు

PARAMAM

- Avadhanula Mani Babu,
M.Sc., B.Ed.,

First Edition	:	**September, 2020**
Rights	:	**Writer**
D.T.P.	:	**M.V.G. Srinivas,** Amalapuram
Cover Page Photo	:	**Vajjhala Nagendra Vara Prasad,** Rajamahendravaram
Printing	:	**Kalimi Sri,** Vijayawada

For Copies:

A. Mani Babu,
3-62, Near Bank of Maharastra,
Sarpavaram, Kakinada Rural, E.G. District,
Andhra Pradesh - 533 005,
Mobile : 99481 79437

సమయం, సందర్భం...

తేది: 12.12.2016 నాడు డా. జోస్యుల కృష్ణబాబు దంపతుల షష్టిపూర్తి వేడుకలో మధునాపంతుల సత్య నారాయణమూర్తిగారు కలిశారు. తిరిగివెళ్ళేప్పుడు కాకినాడ వరకూ నీతో వస్తానోయ్ అన్నారు. తీరా బయలుదేరాక, ప్రక్క వీథిలోనే మా బాబాయిగారున్నారు, ఓసారి పలకరించి వెళదామన్నారు. అలా, అపుడే మొదటిసారి, ఒకే ఒక్కసారి శ్రీ పరమయ్యగారిని కలిశాను. కావ్యమంతా ఓ రసాత్మక వాక్యంలో దాగినట్లు – ఎత్తైన వీథి అరుగుపై విశాలమైన కుర్చీలో ఓ చిన్నమూర్తి.

మూర్తిగారు ఇతర కుటుంబసభ్యుల కుశలం అడిగి వచ్చేలోగా ఆ పెద్దాయన ప్రక్కన కూర్చున్నాను. ఏదో రహస్యం చెబుతున్నట్లు నెమ్మదిగా మాట్లాడారు, కాసేపు. అధికశాతం సాహిత్య విషయాలే. ఆ మాటల సందర్భంలో మూర్తిగారు మా ఇద్దరికీ ఫోటో తీశారు. వెళ్ళొస్తానంటే, ఓ అబ్బాయిని పిలిచి, పుస్తకాలు తెప్పించి వారి చేతితోనే ఇచ్చారు, దోసెడు పుస్తకాలు. ఇంటికొచ్చి చూస్తే పధ్నాలుగు.

అప్పుడప్పుడూ ఏవో ఒకటి రెండు పద్యాలు చదవడం తప్ప, శ్రద్ధగా కూర్చున్న సందర్భం రాలేదు. ఈ మధ్య ఏదో ఫోటో గురించి వెతుకుతుంటే మూడేళ్ళ తరువాత పరమయ్యగారితో ఫోటో కనిపించింది. అరె, వారు ఎంత వాత్సల్యంతో ఇచ్చారో అన్ని పుస్తకాలు! ఇంతవరకూ దృష్టి పెట్టలేదు అని నన్ను నేనే తిట్టుకుని ఆ రోజంతా కూర్చుని చదివేశాను. అనిపించిన విషయాలు మూర్తిగారికి ఫోన్లో చెప్పాను. ఇవన్నీ వ్యాసంగా వ్రాయి, పెద్దదయినా పర్వాలేదు – అని ఒకింత ప్రేమగా ఆజ్ఞాపించారు.

పరమయ్యగారిని చూసింది ఒకసారే, ఐతేనేం! ఏడు దశాబ్దాల వారి దర్శనం పుస్తకాలుగా ముందుంది. ప్రయత్నించాను. పద్యము, ఆధ్యాత్మికత – ఈ రెండిటా నాకు సాధికారత లేకపోయినా ఓ మహనీయుని కృషి కొత్తతరానికి తెలియజేసే అవకాశమని ‘ఊ’ అన్నాను. తత్ఫలితమే ఈ పెద్ద వ్యాసం, చిన్న పుస్తకం.

- అవధానుల మణిబాబు.

పరమ పదం

మధునాపంతుల వేంకట పరమయ్యగారు మనకాలపు ఋషి. "గృహే అతిథి వన్నివసేత్" అనే వాక్యాన్ని ఆచరణలో చూపిన అంతర్ముఖుడు. నేటి సమాజంలో నిన్న, మొన్నటిదాకా మన మధ్యే మసలిన మౌని.

ఆయన బోధల్లోంచి స్ఫూర్తి పొందినవారెందరో. వారి మౌనాన్ని దోసిలిపట్టి జీవితానికి సమన్వయపరచుకున్న వారెందరో. వారంతా ఆయన పిల్లలే. ఎప్పుడు పెద్దాపురం వెళ్ళినా ముందుగా పరమయ్యగారి దర్శనమే. అరుగుమీద కొయ్యకుర్చీలో కూర్చుని మంద్రంగా పలకరించేవారు. ఆ పెదవిదాటని మాటల్లో ప్రేమ, వాత్సల్యం తొంగిచూసేవి. నేల కందిపోతుందేమోనన్నంత సున్నితంగా అడుగులు వేసేవారు. వారి ప్రతి మాటలోనూ తాను కేవలం భగవంతుని చేతిలో ఉపకరణమే అనే భావన కనిపించేది.

పరమయ్యగారి జన్మస్థలం తూర్పుగోదావరి జిల్లాలో పల్లిపాలెం. ఎనిమిదిమంది సంతానంలో ఆరవవారు. మాతృగర్భంలో ఉండగానే పల్లిపాలెం నుండి పెద్దాపురం వచ్చారు. బాల్యంలో భావరాజు జానకమ్మ గారింట్లో ఉంటుండగానే పరమయ్యగారికి ఆధ్యాత్మిక ధోరణి అలవడింది.

12వ సంవత్సరంలో ఉపనయనం జరిగింది. 1946 మార్చిలో ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేశారు. పై చదువులకు కాకినాడ వెళ్ళాలి. కానీ హాస్టళ్ళు, హోటళ్ళు – వీటికి సదాచారం అంగీకరించలేదు. ఊళ్ళో శ్రీ వడ్లమాని వేంకటశాస్త్రి, శ్రీ తేజోమూర్తుల లక్ష్మీనారాయణ శాస్త్రి, శ్రీ చిలుకూరి వీరభద్రశాస్త్రి, శ్రీ భమిడిపాటి భగవతిశాస్త్రి దగ్గర సంస్కృతాన్నీ, కావ్యాలనీ అధ్యయనం చేశారు. 1948లో భాషాప్రవీణ ప్రవేశపరీక్ష పాసయ్యారు కానీ వయసు సరిపోక చదివేందుకు అనుమతి లభించలేదు.

పెద్దాపురంలో పురపాలక సంఘ గ్రంథాలయంలో ప్రాచీన, సమకాలీన గ్రంథాలను రెండిటినీ అధ్యయనం చేశారు.

ఈ దశలో వేదుల సత్యనారాయణశాస్త్రిగారి శిష్యుడు, కవి యక్కల వీర్రాజు పరిచయమయ్యారు. వారందించిన ప్రోత్సాహం వీరి జీవితాన్ని మలుపుతిప్పింది. దేశానికి స్వాతంత్ర్యం లభించిన సందర్భంలో పరమయ్య గారిచే పద్యాలు వ్రాయించి, వాటిని సైక్లోస్టైల్ తీసి పంచారు వీర్రాజు గారు.

వీర్రాజుగారు తాను దర్శించిన క్షేత్రాల గురించి, మహా పురుషుల గురించి పరమయ్యగారికి కథలుగా చెప్పేవారు. రమణమహర్షి, రామకృష్ణ పరమహంస, వివేకానంద వంటి మహనీయుల జీవిత చరిత్రలను వివరించేవారు. వీటి ప్రభావం పరమయ్యగారిపై గాఢంగా ఏర్పడి వివాహానికి విముఖంగా ఉండేవారు. పెద్దల బలవంతంతో వివాహం జరిగినా ఆజన్మాంతం ఋషిజీవనమే గడిపారు.

మావయ్య ప్రోత్సాహంతో "విజయ దశమి" పేరుతో ఉత్తర గోగ్రహణ గాథను 130 పద్యాలుగా వ్రాశారు. దానిని వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు పరిష్కరించారు. జపం, ధ్యానం; గజేంద్ర మోక్షం వంటి భాగవతఘట్టాలు; భీష్ముడు ధర్మరాజుకి ఉపదేశించిన "అనుస్మృతి", విష్ణు సహస్రనామం - పఠనం, పారాయణ మొదలు పెట్టారు, క్రమంగా వాటి అంతరార్థం అర్థం కావొచ్చింది.

1952లో చేబియ్యం వేంకటేశ్వర్లు అనే నరసింహ ఉపాసకుని కలిశారు. వారు పరమయ్యగారిని ఆంతరంగిక భక్తుడిగా స్వీకరించారు. అప్పటికే పరమయ్యగారు కొనసాగిస్తున్న మంత్రజపంలో సవరణను సూచించారు. వారితో కొన్ని తీర్థయాత్రలు చేయించారు.

1971వ సంవత్సరంలో పరమయ్యగారి జీవితంలో మరపురాని సంఘటన జరిగింది. కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ శాంతాజ్యోతిబాబా ప్రసంగాలు జరుగుతున్నాయి. బాబాని దర్శించడానికి ఓ సాయంత్రం వెళ్ళారు,

పరమయ్యగారు. ఆ సమయానికి బాబా ధ్యానంలో ఉన్నారు. వారు ధ్యానం పూర్తి చేసుకుని తిన్నగా పరమయ్యగారిని సమీపించారు. వారి మధ్య సుదీర్ఘ ఆత్మీయ సంభాషణ జరిగింది.

వీరి ప్రశ్నలు, బాబా సమాధానాలు. ఇదంతా శిష్యులు ఆశ్చర్యంతో చూస్తున్నారు. బాబాకు పాదాభివందనం చేసినపుడు పరమయ్యగారికి విద్యుదాఘాతం వంటి ఒక మహాశక్తి ప్రసారమై తలలో ఝుమ్మని నాదం, కాంతి ప్రవేశించాయి. వీరి వివరాలు వ్రాసుకోండి మనకు కావలసిన శిష్యులు నేటికి దొరికారు, ఎల్లుండే మన ప్రయాణం అన్నారు స్వామీజీ (ఇదంతా పరమయ్యగారు వ్రాసుకున్నారు). క్రమేణా సాధనతో, గురుకటాక్షంతో సాధుజీవనం ప్రారంభించి జీవితాన్ని పండించుకున్నారు పరమయ్యగారు.

ఇవీ – వారి గురించి విన్న, తెలుసుకున్న విషయాలు. మా కుటుంబాలకు ఆదర్శ మూర్తి, సమాజానికి ఋషితుల్యులు అయిన పరమయ్య బాబాయిని తలుచుకోవడం మాకెంతో ఆనందాన్ని కలిగిస్తోంది. పరమయ్యగారిని పితృసమానులుగా భావించిన వారి తమ్ముని భార్య పార్వతిగారు చెప్పిన ఎన్నో విషయాలు, పరమయ్యగారు వ్రాసుకున్న అముద్రిత అతిసంక్షిప్త సశేష ఆత్మకథలోని విషయాలు ఈ వ్యాసానికి మూలం. గ్రామస్థులు పరమయ్య దంపతులకు గుడికట్టి ఆరాధించడం గొప్ప విషయం.

కేవలం ఒకసారి కలిసి, మాట్లాడి వారందజేసిన పుస్తకాలపై ఇంతటి విశ్లేషణ చేసిన మణిబాబు జిజ్ఞాసను అభినందిస్తూ, ఆశీర్వదిస్తున్నాను.

- మధునాపంతుల సత్యనారాయణమూర్తి,

ఆంధ్రీకుటీరం, పల్లిపాలెం.

పరమమ్

జీవితకాలంలో సుమారు ఇరవై పుస్తకాలు. వాటిలో సగం స్వతంత్ర రచనలు, మిగిలినవి అనువాదములు. భాసుని నాటకములు, ఆదిశంకరుని ఆత్మబోధ, క్షేమేంద్రుని చారుచర్య, పూర్ణసోమసుందరం తిరువల్లువరు; తులసీదాసు పార్వతీ కళ్యాణం, కబీరు, నామదేవుడు .. ఇలా శతాబ్దులు, ప్రాంతాలు; హరి–హరుడు; అమ్మవారు–అయ్యవారు. ఏ పరిమితులూ విధించుకోకుండా అంతా పరమాత్మేననే అంతస్సూత్రాన్ని మాత్రమే గుర్తెరిగి రచనలు చేసిన పరమయోగి శ్రీ మధునాపంతుల వేంకట పరమయ్యగారు.

ఉద్గ్రంథ నిర్మాణమో, బృహత్తర కావ్యరచనో వీరికి అసాధ్యాలు కావు. ఐనా, ఆ ప్రయత్నాలేవీ చేయకుండా, వ్రాసిన చిన్న పుస్తకాలను సైతం వెంటనే బయటపెట్టకుండా శిష్యులో, మిత్రులో అడిగినపుడో

భక్తుండు ప్రోత్సహించిన
భక్తుండిది వ్రాసె నిత్య పారాయణ మా
సక్తిన్ జేయ దలంచిన
భక్తులకుపయోగ పడగ భగవతి కరుణన్ – అంటూ వినమ్రంగా ప్రచురించారు. అందుకే, ఆవిష్కరణ ఆర్భాటాలు, పరిచయ సభలు, సమీక్షలు... ఇలాంటి మాయలు కమ్మని "కమ్మని" కవి పరమయ్య.

ముందుతరంలో ఓలేటి వేంకట రామశాస్త్రిగారు వ్రాసిన "ఉపాయనము" వీరికి ఈ భక్తిమార్గంలో పాథేయమైంది. ఇక, సోదరులు "మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి" గారి సాహిత్యం చేయిపట్టి నడిపించింది.

కాల్పనిక సాహిత్యంవైపు మళ్ళకుండా, "చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు" అని నమ్మి, అదే తాను మరలమరల చదివి; మనబోటి వాళ్ళం చదువుకునేందుకు సరళమైన పద్యాలుగా పంచారు.

నా కృషి నామమాత్రమె యనందగు, నీ కరుణా విశేషమే
నాకు బలమ్ము కూర్పగ నొనర్పగ గల్గితి నింత పాటిగా;
ఏకడ లోపమున్న నదియెల్లను నాది, గుణంబు నీదిగా,
వాకొనుచుంటి నా హృదయ వాసిని! నీకు నెరుంగ రాదటే!

అని గుణదోషాలకు వీలువ్రాస్తూ సౌజన్యాన్ని ప్రకటిస్తారు అథర్వ శీర్షగత "శ్రీ లక్ష్మీ హృదయము" అనువాదంలో.

అప్పకవి చెప్పిన సత్కవి లక్షణాలు చప్పున గుర్తొస్తాయ్ వీరి పుస్తకాల వివరాలు తెలియగానే.

"ధరణీ సురుడు ప్రశాంతుడు,
గురుభక్తుడు, శుచియు గల్పకుడు, పూర్వకవీ
శ్వర వాక్ప్రయోగ దక్షుడు
"గరుణామతి యెవ్వడతడు కవి యన బరగున్" (అప్పకవీయం, 1-44). అచ్చం అలాంటి కవి పరమయ్యగారు. అలాగే, నానృషి: కురుతే కావ్యం అనే లోకోక్తిని అనుసరించి కలికాలంలోనూ సత్కావ్యకర్తలైన సుకవులందరినీ ఋషులుగా (మౌనులు) గా భావించాలి అంటారు అప్పకవి, అంతకు ముందు పద్యంలో. అలా ప్రత్యేకంగా భావించనక్కర లేకుండా నూరుశాతం ఋషి ఐన సత్కవి వీరు. ఇక పూర్వకవీశ్వర వాక్ప్రయోగం దక్షతగానే భావించాలి. ఇది ఆరాధన, అనుసరణే తప్ప ప్రత్యామ్నాయాలు లేక కాదు.

భక్తి తప్ప మరేమీ లేనితనం

సాధారణంగా శతకకారులు కొన్ని పద్యాలలో నిందాస్తుతి, అలక, దెప్పిపొడుపు ఇవన్నీ ప్రకటిస్తారు – పరమాత్మ తమకు చాలా దగ్గరవాడేననే భావనతో. కానీ వీరి పద్యాలలో నిర్మలమైన భక్తి తప్ప మరే విచలనాలు కనిపించవు. ఇతర ఖండకావ్యాలలో కూడా – భక్తి, ఉపదేశము, ధర్మ మార్గానుసరణ ఈ అంశాలే చమురుగా వీరి సాహితీజ్యోతి ప్రకాశనం చెందింది.

భగవంతుని చేరుకున్న మానవ చిత్తవృత్తియే భక్తి అని ఆదిశంకరులు శివానందలహరిలో “అంకోలం నిజబీజ సంతతి...” శ్లోకంలో తేల్చిచెప్పారు కదా!. అచ్చం అలాంటి భక్తులు పరమయ్యగారు. అందుకే, అయస్కాంత ఆకర్షణకి అతుక్కున్న సూదిలా పరమాత్మ దివ్యశక్తి ప్రభావంతో ఒకే భావనా కక్ష్యలో భ్రమణం చెందారు.

శ్రవణం, స్మరణం తత్ఫలితంగా పద్యరూప కీర్తనం మూడు విభాగాల భక్తుల జాబితాలో ముచ్చటగా చోటు సంపాదించుకున్నారు.

నిజానికి ప్రేమ, భక్తి రెండూ ఒకటే అంటారు పెద్దలు. ప్రేమ లౌకిక వాసనల మాలిన్యం అంటకుండా ఉదాత్తతను పొంది భగవంతునిపై నిలిచినపుడు అది భక్తి అని పిలువబడుతుంది. సాధన మొదటి దశలో తనను పూజకుడిగా, భగవంతుని పూజ్యునిగా భావించిన భక్తుడు క్రమంగా తరువాత దశలలో అభేదస్థితిని పొందుతాడు. ఈ పరిణామక్రమాన్ని మనం వీరి రచనలలో సులభంగా దర్శించగలం.

రచన అనువాదమైనా, స్వతంత్రమైనా "భక్తిమీది వలపు బ్రాహ్మ్యంబుతో పొత్తు పాయలేను నేను బసవలింగ" అన్న మల్లికార్జునుడిలా **"భవచ్చరణాబ్జ భక్తి లలనా పరవశ భావమున నిన్ను ప్రణుతింతు శివా"** అని తనదైన పరిధిలో నిత్య పారవశ్యాన్ని పొందారు.

శతకనియమాలుగా పేర్కొనే సంఖ్య, నియత మకుటం, స్వీయానుభూతి విస్మరించకుండా భక్తినే నమ్ముకుని ఇన్ని రచనలు చేశారు.

చంద్ర కాంతే యథా తోయం, సూర్య కాంతే యథాఽ నలః
బీజే యథాంకుర స్సిద్ధ స్తథాత్మని శివ స్థితః

చంద్రకాంత శిలలో నీరు, సూర్యకాంత శిలలో నిప్పు, విత్తునందు మొలక ఎలా సహజసిద్ధంగా ఉంటాయో అట్లే జీవునిలో పరమేశ్వరుని భావం స్వతఃసిద్ధంగా ఉంటుందని రేణుకాచార్యులు అన్నారుగా! అదిగో ఆ సహజాతాన్ని జీవనపర్యంతం నిలుపుకొన్న ఋషి వీరు.

***

కొన్ని పుస్తకాల గురించి:

1. గురు గీతము

ఇది శుక్లనామ సంవత్సర "శివరాత్రి" నాడు వ్రాసిన సాయి శతకము. ఇతర భక్తి శతకాల్లా సాయిలీలలను, మహిమలను, జీవన రేఖలను, క్షేత్రాలను కాక గ్రంథనామానికి తగినట్టు సద్గురువు లక్షణాలను చరాచర జగత్తులో దర్శించి అక్షరబద్ధం చేసిన 108 పద్యాలివి. వాటిలో పేర్కొన్న లక్షణ స్వరూపమైన సద్గురువు నీవే సాయీ అని చెప్పకనే చెప్పి సమర్పించిన కావ్య ప్రసూనమిది.

కావ్యాదిలో ఇష్ట దేవతా ప్రార్థన, గురు ప్రార్థన చేయాలికదా! అందులోనూ ఇది గురు గీతం. శతకకర్త ఇక్కడో చక్కని చమత్కారం చేశారు. మనకు ఎంతో పరిచయమైన

సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం

అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం శ్లోకాన్ని యథాతథ అనువాదం చేశారు ఇలా:

అల సదాశివ ప్రారంభమయి తనర్చి,

శంకరార్య మధ్యమమయి సొరుగాంచి

అస్మదాచార్యవర్య పర్యంతమైన

గురు పరంపర కెలమి మ్రొక్కుదును సాయి!–ఎంత హాయిగా ఉందీ పద్యం. ముందుగా అనుకున్నట్లు 'సాయి' సంబోధనతో పద్యాలన్నీ నడిచినా అవి సద్గురువు లక్షణాలను తెలియజెప్పేవే. పరమయ్యగారి శతక రచనలో ఒక వ్యూహం కనిపిస్తుంది. అదేమిటో మరోచోట చెప్పుకుందాం.

గ్రుడ్లను పిల్లలుగా మార్చే దశలో తల్లి ప్రాణి బాధ్యత గొప్పది. ఐతే ఆ బాధ్యతలు పక్షులకు, చేపలకు, తాబేటికి – వివిధ జీవులకు విభిన్నంగా నిర్దేశింపబడ్డాయి. ఈ భావనను ఒక్కోజీవిని ఒక్కో పద్యంలో ఉంచి ఆ బాధ్యతలను గురువుకి ఆపాదిస్తారు కవి.

ఇక్కడ పొదగడమంటే నూతన జీవితానికి నాంది పలకడం. మరో కోణంలో అజ్ఞానపు పెంకు పగిలి జీవద్రవ్యమైన జ్ఞానం వెలుగుచూడడం.

తరువాత పద్యాలలో పంచభూతాలనూ ఒక్కో పద్యంలో చెబుతూ ఐదు తత్త్వాలను సద్గురువుకి ఆపాదిస్తారు. తరువాత, ప్రాకృతిక అంశాలైన సూర్యచంద్రులను, కడలి... వీటి లక్షణాలను; వివిధ జంతువులు, కీటకాలు, సరీసృపాలలో స్వీకరించదగిన విశేషాంశాలను సద్గురువు లక్షణాలుగా దర్శిస్తారు.

"గ్రుడ్డు పైననే దృష్టి నెక్కొనగ జేసి
మత్స్య మద్దాని బిల్లగా మార్చునట్లు"

"గ్రుడ్డు నందె యేకాగ్రతగుదురు కొలిపి!
కచ్ఛపము పిల్లగా మార్చు కరణి..."

– ఇలా గురువు శిష్యునిపై దృష్టి ప్రసరింపజేసి జ్ఞానవంతునిగా చేస్తాడని; గురువు మనసులో ధ్యానించినంతనే శిష్యునికి ఉత్తమ స్థితి ప్రాప్తిస్తుందని అన్వయిస్తారు. మరో పద్యంలో బ్రహ్మతత్త్వము బోధజేసే జీవిగా సాలీడుని వర్ణిస్తారు.

అద్దం, దీపం, నీటిబుడగ, గడ్డిపోచ... అన్నిటా గురువుకు ఆపాదించగల విశేషాలను వెతికితెస్తారు.

ఈ క్రమంలో ఎదురయ్యే ఆశ్చర్యకరమైన ఈ పద్యం చూడండి:

"నేను నాయది యను నభిమానమెల్ల

మూలముట్టుగ నణగారి పోవవలయు

లేనిచో మోక్షమది కలలోని మాట"

యనెడి శవమును సద్గురుండగును సాయి!

నిర్జీవ తత్త్వంలోంచి గురువును (బోధనను) దర్శించగలగడం పరమయ్యగారి పరాతత్త్వం. లక్షణాలు సరే, కానీ అలాంటి గురువు దొరకడం సామాన్యమా! కాదంటారు, కవి.

కామినీ కాంచనములపై కాంక్షలేక, వాసనాత్రయ ముక్తుడై, ద్వంద్వములకు దూరముగా ఉండు నాతడే దొడ్డగురువు, దొరకునాతండు సుకృతవంతులకె, సాయి – అంటారు.

(**వాసనా త్రయములు:** లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన ఈ మూడింటిని వాసనాత్రయములు అంటారు. లోకవాసన – లోకముతో పాటుగా సంచరించాలనీ, అంతా తనను కీర్తించాలని మనసులో భావిస్తూ ప్రవర్తించడం; దేహవాసన – తాను పవిత్రుడను అనే భావనతో ప్రవర్తించుట; శాస్త్రవాసన – సర్వ శాస్త్రాలలో దిట్ట కావాలనే కోరిక (కీర్తి కాంక్షతో) మనసులో ఉండి ప్రవర్తించుట)

మరో పద్యంలో "కర్ర గోవును పిదికిన పాలురానట్లు సద్గురువుని ఆశ్రయించక ఆత్మ సుఖాన్ని పొందలేము" అని ప్రకటిస్తారు.

చివరికి ఇహంలో భగవంతుని ప్రతిరూపము సద్గురువే అని తెలిపి అభేదత్వాన్ని చాటుతారిలా:

తనువున కొసంగు నాహారమున మనస్సు
శాంతినందు; నదేరీతి సద్గురునకు
నిచ్చు నాహారమును దైవమే గ్రహించు,
వారలకు లేదు భేదభావంబు, సాయి!

ఎంత గొప్పదీ భావన. నిజమే కదూ! శరీరానికి ఆభరణాలను అలంకరిస్తే ఆనందం కలిగేది మనసుకి. గురువుకీ పరమాత్మకీ సంబంధం ఇలాంటిదే అంటారు. పరమాత్మ రూపం అగోచరం కావున, సద్గురువు సరూపుడైన పరమాత్మ. దీనికి కొనసాగింపుగా మరో పద్యంలో గురువుకి తన జీవితాన్ని అర్పణ చేసుకున్నవాడే ఆత్మసామ్రాజ్యము చేరడానికి అర్హుడు అంటారు.

మూగవాని భాష మరో మూగవానికే అర్థమైనట్లు ఆత్మసుఖంలోని అనుపమానందాన్ని, ఆ స్థితిని అనుభవిస్తున్నవాడే తెలుపగలడు తప్ప అన్యులకు సాధ్యం కాదంటారు. తన గురువులలో తాను గుర్తెరిగిన అంశాలన్నీ ఈ రచనలో పరమయ్యగారికి ప్రేరణకారకాలు కావచ్చు.

వీరు వ్రాసిన చంద్రోదయం శతకంలో–

"శాస్త్ర సుధ గ్రోలి పుత్రుని సరణి సాకి
కనులు తెరపించినట్టి విజ్ఞాని భమిడి
సూర్య భగవద్గురుం డుపాస్యుండు నాకు" – అంటూ తన గురువుని స్తుతిస్తారు.

అన్నట్లు గురుకృప పుష్కలంగా పొందిన ధన్యజీవి వీరు. ఓ సందర్భంలో వారి గురువు యక్కల వీర్రాజు వ్రాసిన ఆశీఃపద్యం ఇది –

మధుర శ్రావణ పూర్ణ వారిధర సామ్య స్ఫూర్తి యుష్మ త్ప్రమో
ద ధరస్వాంతము తప్త భారతమనో ధాత్రిన్ గవిత్వోజ్జ్వల
త్సుధలన్ వర్షిల జేసి, నిర్మల రసస్రోతస్వినీ పంక్తి స
ర్వ ధరిత్రిన్ బ్రవహింప జేసి శుభ సంపత్సస్యము ల్నింపుతన్!

ఈ సందర్భంగా పరమయ్యగారి గురు పరంపరను తెలుసుకుందాం:

బాల్యంలో శ్రీ వడ్లమాని వేంకటశాస్త్రి వద్ద సంస్కృత అధ్యయనం మొదలుపెట్టారు. తరువాత శ్రీ తేజోమూర్తుల లక్ష్మీనారాయణ వద్ద రఘువంశం కొనసాగించారు. లక్ష్మీనారాయణగారు గ్రామాంతరం వెళ్ళడంతో ఉద్యోగరీత్యా పెద్దాపురం వచ్చి పరమయ్యగారింటికి ఎదురుగా నివాసం ఉంటున్న శ్రీ చిలుకూరి వీరభద్రశాస్త్రి వద్ద కుమారసంభవం చెప్పుకున్నారు. తరువాత వైదిక పట్టభద్రులు, వ్యాకరణ శిరోమణి శ్రీ భమిడిపాటి భగవతిశాస్త్రి వద్ద శిష్యరికం చేశారు. వారు కర్మయోగి. వీరివద్ద సిద్ధాంతకౌముది అధ్యయనం చేశారు. పరమయ్యగారికి ఎంతో స్ఫూర్తినిచ్చిన వారీయన.

అనంతరం శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రిగారి శిష్యుడు, కవి, శివభక్తులు శ్రీ యక్కల వీర్రాజు పరిచయం కావడం, వారివెంట సాహిత్య సభలకు హాజరుకావడం జరిగింది. వీర్రాజుగారి పరిచయం యువకులైన పరమయ్యగారిని ప్రభావితం చేయడమేకాదు, పరిణతినీ పెంచింది.

***

ఇపుడు మరో పుస్తకంలోకి వెళ్దాం!

2. మల్లికా మాలిక

విభిన్న ఖండికల సంకలనమీ గ్రంథం.

అ) "శివార్చనము:

పూజకు సిద్ధం చేసుకున్న ఆరింటిలో రెండు విధాల పూవులు ఎంచుకున్నారు కవి. మొదటి నాలుగూ పద్యాలు (వేర్వేరు వృత్తాలు) కాగా, చివరి రెండూ శ్లోకాలు. ఇది అదనపు గుణమే కానీ దోషం కాదేమో!

ఓసారెపుడో, డా. ఆవంత్స సోమసుందర్ గారిని "నూతన భావన కలిగినపుడు దానిని కవిత, గేయం, కథ.. ఇలా ఏ రూపం ఇవ్వాలో ఎపుడు నిర్ణయించుకుంటారు?" అని అడిగాను. వారు "మనలో భావన ఉదయించగానే అది మనసులోనే అందుకు అనువైన శబ్దాలను, శిల్పాన్ని, ఇతరత్రా నిర్మాణపరమైన సరంజామాను వెంట తీసుకుని బయటకొస్తుంది, అపుడే అది సహజత్వానికి దగ్గరగా ఉంటుంది" అన్నారు. అలాగే, ఈ ఖండిక నిర్మాణంలో కొన్ని సందర్భాలలో భావన తనకు అవసరమైన భాషను ఎంపిక చేసుకుంది. సవ్యసాచులైన వారికున్న అదనపు ప్రయోజనమిది.

పరమేశ్వరుని పరివేష్టితమైన – రెండు నాలుకలు, వంకర నడక గల పాముని; సకళంకుడు, జడమూర్తి అయిన చంద్రుని; జంతువులైన ఎద్దు, ఏనుగు వీటి అవలక్షణాలను తెలుపుతూ – **"నిన్ను శరణనవలె గాని నిక్కువముగ నెట్టి వారిని గావలేదీవు దేవ! ఎంచి చూడంగ నాయం దివెల్ల నుండు శరణు బొందితి గాపాడ జాగదేల"**? అని వేడుకుంటారు.

ఆ) గణపతి తారావళి:

అంకము జేరి పద్యాన్ని గుర్తు చేసుకుంటూ

ఒడిలోన జేరికొని చను గుడిచెడి సమయాన నేవొకొంటె పనులన
వ్వడరగ జేసితివని చెప్పెడి పెద్దన మాట నిజమె విఘ్నాధిపతీ!

అని గణపతినే అడుగుతారు, అది పెద్దనగారి భావనా లేక నిజమా అని? 27 పద్యాల ఈ ఖండికలో (తారావళి కదా!) గణపతి మాహాత్మ్యాలను అందించారు. నిజానికి వినాయకుని చరిత్ర ఒక్కో పురాణంలో ఒక్కో విధంగా ఉంటుంది. అందుకే కవి **"నీ పుట్టువు తెలిపెడి యా కతలు పెక్కు తీరులనుండెన్, దెలియదు సమన్వయపు దెరు, వలవడ జేయుమది" అంటారు** – తొలిదేవరతో, ఇంత తెలిసినా ఏమీ తెలియనట్లు.

ఇ) లలితోపాసనము:

కామేశ్వరీదేవి వీరి ఇలవేల్పు. సత్యనారాయణశాస్త్రి గారు "మా తల్లి పుట్టింటి వేల్పై కాపాడుచునున్న యన్నెనరు నాయందింత సారింపుమమ్మా, కైమోడ్తు భవత్కటాక్ష రస భిక్షాభ్యర్థినై భక్తిమై" అన్నారు. సూరయ్య శాస్త్రి గారు దేవీ నవతి పేరిట అమ్మను అర్చించారు. ఆ తానులో గుడ్డ పరమయ్యగారు మాత్రం అమ్మను అక్షరార్చన చేయకుండా ఎలా ఉంటారు? – అదే ఈ లలితోపాసన. చెప్పకతప్పని విషయమొకటుంది – కొన్నిచోట్ల లలితా సహస్ర నామాలను యథాతథంగానూ, మరికొన్ని చోట్ల వాటి అర్థాలను, పద్యాలలో ఉంచడం వలన కొత్త పద్యాలను చదువుతున్న అనుభూతిని పాఠకుడు పొందలేడు.

ఉదా: **చంద్రమండల మధ్యగా! చంద్ర విద్య!**
చారు చంద్ర కళాధరా! చారు హాస!
చక్రరాజ నికేతనా! చండికా! ప్ర
చండచండ నిషూదినీ! జయము నిమ్ము.

ఇది లలితోపాసనములో రెండవ పద్యం. 3,4,5,6,7,8,9,30, 41,43 పద్యాలూ ఇదే కోవకు చెందినవి.

"శివుడు నిన్ను గూడి చెందు విభుత్వంబు, కానినాడు చేత గానివాడు ముగురు వేల్పులకును బూజనీయవు! నిన్ను బొగడగలడె అకృత పుణ్యుడంబ!";

"త్వత్పదాంబుజాత పాంసు లేశమ్మున అఖిల సృష్టిచేయు నబ్జసూతి, పూని వేయితలల మోచు విష్ణుడు దాని, నదియె యొడల దాల్చుహరుడు, తల్లి!"
– వంటివి ప్రస్తావించగల పద్యాలు.

ఈ) కందుకూరి వీరేశలింగం కవి స్మృతి: కందుకూరి కార్యదీక్ష; వితంతు వివాహాలు, స్త్రీ విద్య అన్నిటినీ స్పృశిస్తూ పది పద్యాలుగా వారి బహుముఖీనతను ప్రస్తుతించే ప్రయత్నం చేశారు.

బహుముఖమైన యభ్యుదయ పద్ధతి యాంధ్ర ధరిత్రి నిల్ప న
న్వహము బరిశ్రమించి యధునాతన భావ విశిష్ట ధోరణీ
సహితముగాగ సంఘమును జక్కగ దిద్దగ బూనుకొన్న యా
సహజ పరోపకార గుణ సంపద నెవ్వరు సన్నుతింపరో.

ఆంధ్ర వాఙ్మయ మహామర భూజము విస్తృతంబున అభ్యుల్ల సితంబు చేసిన మహోదయుడాయన – అని సన్నుతించారు.

మరో ఖండికగా కర్ణుని దానగుణాన్ని తెలిపే కథను "దానఘంట"గా అందించారు. యాగం నిమిత్తం కలపను (ఇంధనం) కోరడం; కర్ణ, దుర్యోధనులిద్దరూ మాట ఇవ్వడం; వానలు పడ్డాక మరల వచ్చి అడగడం, దుర్యోధనుడు అశక్తుడై మాట తప్పడం, కర్ణుడు బాణాలతో ఛేదించి ఇంటి వాసాలను, దూలాలను బండ్లకెత్తించి ఇవ్వడం – ఈ కథనంతా ఎంతో హృద్యంగా 23 పద్యాలలో చెప్పారు. చివరలో **"త్యాగము నీదగు సొమ్ము"** అని ప్రస్తుతించడం మరో గొప్ప ప్రయోగం.

ఉ) నీరాజనము:

ఎనిమిది పద్యాలతో నన్నయకిచ్చిన హారతి ఈ ఖండిక. **"బహిరంత రార్థ శోభాసముపేతమై"** అంటారిందులో నన్నయ శైలిని.

మురజము మ్రోగినట్లు, మధుపూరము లూరినయట్లు, పచ్చక
ప్పురములు కుప్పవోసినటు, పువ్వుల నవ్వుల మూట గట్టిన
ట్లురవడి బారు గంగయటు, లొప్పు భవత్కవితా మహత్త్వవి
స్ఫురణము కుండలీంద్రు నకె చోద్యము గొల్పె దదన్య లేటికిన్?

– అన్నట్టు, ఈ పద్యంలో కరుణశ్రీ నడక కనిపిస్తోంది కదూ!

ఊ) రవి స్మృతి:

రవీంద్రుని ప్రభావం నుంచి, ఆరాధన నుండి తప్పించుకున్న కవులు అరుదు, పరమయ్యగారి తరంలో. (ఇప్పటి తరంలోనూ!) ఆ విశ్వకవికి నివాళిగా వ్రాసిన ఈ పద్యాలు రవిస్మృతి పేరిట ప్రచురించారు. ఈ ఖండికలోనే కాక మొత్తం పుస్తకంలోనే అద్భుత పద్యం ఇది:

కంజభవప్రియా చరణ కంజ మనోహర నూపురద్వయీ
మంజుల శింజితోపమిత మంగళనాద లయానుబద్ధ గీ
తాంజలి కావ్యగాన సముదంచిత కీర్తివిభా ప్రభావిత
ప్రాంజలితాఖిలక్షితితలా ! రవిసత్కవి స్వాగతంబిదే.

ఋ) సూర్య ప్రతిష్ఠ:

పెద్దాపురంలో సూర్యాలయ ప్రతిష్ఠ సమయంలో వ్రాసిన ఖండిక ఇది:

"గగన పటమున నభినవ కల్పనముల
సరస చిత్రకళా సృష్టి సంతరించి
సభ్యలోకమునకు బ్రదర్శన మొనర్చు
చిత్రకారుని ప్రత్యగ్రమిత్రు నెంతు" అని

సత్యనారాయణ శాస్త్రిగారు ఆదిత్య హృదయాన్ని ఆవిష్కరించారోచోట.

తనదైన శైలిలో పరమయ్యగారు **"పయోజవికాసము గూర్చుచున్ రుజా ప్రకర మడంచుచున్"** అన్నారు సూర్య శక్తిని కీర్తిస్తూ. క్షేత్రమహిమను వివరిస్తూ – **"ఇచ్చోట మున్ పాండవుల్ పద విన్యాసము చేసి, యైదునెల లొప్పన్ నిల్చి యిక్కొండపై మది భాస్వంతుని గొల్చి తత్కరుణ సంపాదించి కొన్నట్లు కోవిదవర్యుల్ వివరింతు, రిందులకు దైవీ శక్తులే సాక్ష్యముల్"** అంటారు.

ఇక మద్యపాన నిషేధం గురించి హితోపదేశం; చైతన్యహేల పేరిట మంచిమాటలు, ఉగాది సందర్భముగా వ్రాసిన కోకిల గీతము, వైభవము; ఇలాంటివే మరికొన్ని పద్యాలు ఈ పుస్తకంలో అంత అర్హత లేకున్నా చోటుపొందాయ్.

***

3. నివేదనము

ఇది కూడా అక్కడక్కడా శ్లోకాలు, అధికభాగం పద్యాలతో నిండి

"భవదీయ భక్తి శోభా పరిపూర్ణు జేసి

పరులకు మేలే సేయగల పాటవ మిమ్ము" అని రాముని వేడుకున్న గ్రంథం.

"భవదీయాంఘ్రిస్ఫురద్భక్తి చైతన్యమొక్కటి దక్క" ఇతరములు ఏవీ కోరబోను అంటారు. అపుడపుడు కోరినా – **"మజ్జీవిత కాళరాత్రి వెలిగింప గోరుదున్!"** అనో లేక **"చిల్లగింజ చేత చిక్కని మలినంబు తొలగి తేటదేరు జలము వోలె నీ పాదభక్తి వలన నా బుద్ధి సుప్రసన్న మవ్వాలి"** అనో మాత్రమే.

పరమయ్య గారి పాండితీ పటిమ తెలిపే ఈ పద్యం చూడండి–

రామా! నీ దయ యుండెనేని సకలాంధ్రక్ష్మాస్థలీ సత్కవి
స్తోమస్తుత్య కవిత్వ నిర్మితల సచ్ఛుద్ధాంధ్ర కావ్యస్ఫుటో
ద్దామా ఖండయశో విభూషితుడనై త్వత్పాద పీఠంబు పై
బ్రాముఖ్యంబున బూజ సేయనొకొ దీవ్యద్భావ పుష్పంబులన్

గుండెలు చీల్చి రాముడు ఇడుగో అని హనుమలా మరొకరు చూపలేరు స్వామీ! నా గుండెలో ఉన్న భక్తికే తనిసి, యోగ్యత నెంచక, నీకు గల దయాసముద్రుడు అనుపేరు సార్థకమగునట్లు నన్ను తీర్చిదిద్దుకో అంటారో పద్యంలో తన అశక్తతను శక్తివంతంగా తెలియజేస్తూ. వింతైన నీ చరిత్రము వింటుంటే తన్మయత్వం, శాంతి లభిస్తున్నాయి, ఇంతలో ప్రాపంచిక ఊహలు చుట్టుముట్టి ఆ శాంతిని హరిస్తున్నాయి, ఈ స్థితిని చక్కదిద్దు స్వామీ అని వేడుకుంటారు.

"కానుకగా నొసంగెదను గైకొనుమయ్య! మహానుభావ! మ
న్మానస దేవతా తరువునన్ వికసించి యఖండ భక్తి ఝుం
ఝానిల మూపగా సహృదయ ప్రమదమ్మొనరింప జాలు నీ
మానిత రమ్య పద్య కుసుమమ్ముల గూర్చిన మాలికా తతిన్".

"జననమ్మును మృత్యువులేని పున్నెపుందెన్నున జక్కగా నడిపి తేకువ మీరంగ నేలుకో ప్రభూ!" – ఎంత నిస్వార్థమైన కోరికలో చూడండి.

ఇక, స్వామి స్వాధీనం కాక ఏమవుతాడు? తనవాడయ్యాక కవి ఇలా అంటున్నాడు:

నా కనుపాపలో మెలగి, నా గళమందు జెలంగుచుండి, య
స్తోక మదీయ చిత్తమున దోచుచు సన్నిధి నిచ్చి సర్వమౌ
లోకము రూపమై వెలి వెలుంగుచునుండెడి రామమూర్తికిన్
నీకు నమస్కరించెదను నిర్మల కీర్తికి ధర్మవర్తికిన్ – మనమూ ఒకసారి "ధ్యాయేదాజానుబాహుం..." అంటూనో, "శ్రీ రాఘవం దశరథాత్మజ మప్రమేయం..." అనో నచ్చినవి, నోటికొచ్చినవి స్మరిస్తూ నమస్కరిద్దాం.

***

4. చంద్రోదయము

రామునిపై మరో పుస్తకమిది. రామకథ ఎంతవ్రాస్తే తనివి తీరుతుంది? ఐనా, పోయేదేముంది, పాపం తప్ప. అందుకే ఎందరెందరో ఎన్నెన్ని విధాలుగానో రామనామాన్ని, కథా గానాన్ని చేశారందుకే.

ఆదౌరామ తపోవనాది గమనమ్ హత్వామృగం కాంచనం.. అంటూ ఒక్క శ్లోకంగా జపించే వారు కొందరైతే – "శుద్ధబ్రహ్మ పరాత్పర రామ" నుండి "రామరామ జయ సీతారామ" వరకూ 108 నామ రామాయణాన్ని పారాయణ చేసేవారు కొందరు.

యావత్ స్థాస్యంతి గిరయ: సరితశ్చ మహీతలే
తావత్ రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి (వాల్మీకం 1-36).

ఎంతవరకూ ఈ భూమిపై పర్వతాలు, నదులు నిలిచి ఉంటాయో అంతవరకు రామాయణ కథ సకల లోకాలలో నిండిపోతుంది అని బ్రహ్మ వాల్మీకితో చెప్పిన మాటలు అతిశయోక్తిగా తోచలేదు పరమయ్యగారికి, అందుకే, **రమ్య గుణ సాంద్ర, శ్రీ రఘు రామచంద్ర!** అని అందుకున్నారు.

అన్నట్టు, శతక నిర్మాణంలో వీరికో టెక్నిక్ ఉందనుకున్నాం కదా! జాబితాగా ఒకచోట చేర్చదగ్గ విషయాలను ఎంచుకుని వాటిపై వరుసగా పద్యాలు వ్రాయడం. ఇందాక గురువుపై పంచ భూతాలు, ప్రాకృతిక శక్తులు, జంతువులు, అలా.

ఇపుడు రాముని శతకం కదా!. మరి, రాముడంటే సాక్షాత్ నారాయణుడే. "అనేక రూప దైత్యాంతం నమామి పురుషోత్తమం"! అందుకే కవి ఒక్కో అవతారంపై ఒకో పద్యం వ్రాసుకున్నారు. (దాశరథీ శతకకర్తా అదే చేశారు కదా!). వీటిని హాయిగా కంఠస్థం చేసి ఏ అవతారాన్ని దర్శిస్తే ఆ పద్యాన్ని పాడుకోవచ్చు.

ఎన్ని వేషములైనా వేయించుగానీ, ప్రతి వేషములో నీ అనూనభక్తి కలిగిఉండేలా వరమిమ్మని అర్థిస్తాడు; మరో పద్యంలో, నన్ను పరీక్షింప ఊహ ఉంటే దానిని తట్టుకొనే స్థైర్యం కూడా నీవే ఇవ్వమని ప్రార్థిస్తాడు, కవి.

కేవలం, రామ కథను, మహిమనో కాకుండా–

భూమి బ్రత్యక్ష దేవతా మూర్తులైన

తల్లి దండ్రుల దలపని తనయు డేల?

నిలిపి కొత్త వారల నెప్డు నిండుటెడద

రమ్య గుణ సాంద్ర! శ్రీ రఘు రామచంద్ర! అంటూ సూక్తి సుధలు కురిపిస్తారు మధ్య మధ్యలో.

నాదు తనువు, మనస్సు, ప్రాణములు నీవె

యిష్ట మయినట్లు పనులు చేయించు కొనుము" అన్నపుడు

"ఎన్ని వేషములైన వేయింపుమయ్య

కాని ప్రతి వేషమున నీ యనూన భక్తి

గల్గి యుండెడి వరమిమ్ము కరుణతోడ" –

అని ప్రార్థించినపుడు ఓలేటి వేంకటరామశాస్త్రి గారి "ఉపాయనం" గుర్తొస్తుంది.

శ్రీరామనవమినాడు రామచంద్రునకు ఈ పుస్తకాన్ని అంకితమిస్తూ

"వరసువర్ణోజ్జ్వలత్కాంతి భరితశతక

పతక మిదిగొ జన్మదినోత్సవమ్ము వేళ

నీకు గైసేయుచుంటి; మన్నించి కొనుము" అంటారు, వినమ్రంగా రమ్య గుణసాంద్రుడైన శ్రీ రఘు రామచంద్రునితో.

ఈ పరమ రామ భక్తికి కారణం వీరి తాతగారు సూరయ్య శాస్త్రి గొప్ప పండితులు. ఇక, మాతామహులకు (వీరి పేరే పరమయ్యగారికి పెట్టారు) సంగీత సాహిత్యాలలో ప్రవేశం ఉంది. రాఘవం కరుణాకరం అంటూ రామస్తవాన్ని; ఆధ్యాత్మ రామాయణ కీర్తనలనూ గానం చేసేవారు తాతగారు. తండ్రి వ్యాఖ్యాత, తల్లి పౌరాణికురాలు, తాత ఒడిలో కూర్చున్న చిన్న పరమయ్య శ్రోత. ఇదీ బాల్యం. అలా పరమయ్యగారిలో రామ భక్తికి బీజావాపనం జరిగింది. పెరిగి పెద్దయ్యాక, అక్షర స్వరూపుడైన రామచంద్రుని అక్షరములతో అర్చించే భాగ్యం కలిగి, అక్షరమైన భక్తిని ఈయవయ్యా! అని ప్రార్థించేట్లు చేసింది.

***

5. అనువాద రచనలు

పరమయ్యగారి అనువాద రచనలను ప్రస్తావించకపోతే వారి సాహిత్యకృషిలో సింహభాగాన్ని విస్మరించినట్లే. పుస్తకాలపై ప్రచురించిన సంవత్సరాలున్నాయ్ కానీ, వ్రాసినదెపుడో లేదు. వారు పుట్టినది 1931లో కాబట్టి అవి సుమారు 1960 నుండి 80 మధ్యలోనివేమో! వారి సమకాలీన కవులు ఎందరో ఆదిశంకరుల స్తోత్రాలను, రవీంద్రుని గీతాంజలిని, భక్తి ఉద్యమ సాహిత్యాన్ని, కులశేఖరుని ముకుందమాలను; ప్రఖ్యాత భారతీయ కవుల (ముఖ్యంగా హిందీ) రచనలను, ఉమర్ ఖయ్యాం రుబాయీలను తేటతెలుగు పద్యాలుగా వ్రాశారు. ఆ కోవలోనే నచ్చిన గ్రంథాలు కొన్నిటిని వీరు తనదైన శైలిలో అనువదించారు. ఏ కాలంలోనైనా మనిషి ఆలోచనంతా ఆదిమ విషయాల గురించి అంతిమ వ్యాఖ్యల కొరకే. తానూ అందుకు మినహాయింపు కాదని పరమయ్యగారీ పుస్తకాల ద్వారా ప్రకటించారు, సవినయంగా.

డా. ఎన్. రామచంద్ర (సాహితీవేత్త, ప్రొద్దుటూరు) "తేనెపల్కులు, తీపి గుర్తులు" విమర్శ గ్రంథంలో చెప్పిన ఓ సంగతి గుర్తొస్తోంది. ఊరి రచ్చబండ దగ్గరో, చెరువుగట్టు వద్దో పెద్దలంతా కూర్చుని ఈ ఏడు వాతావరణాన్ని బట్టి, వర్షపాతాన్ని అనుసరించి ఏ పంటకి అనుకూలమని ఆలోచించి, అంతా ఒక మాట అనుకుని ఊరంతా ఒకే సాగు చేస్తారు. సాహితీ కృషీవలులూ అంతే, సమాజ స్థితిగతులు, పాఠకుల అవసరాలు ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని అధికశాతం ఒకే విధమైన సాహిత్యం అందిస్తారు. దానిని మనం సాహిత్యంలో ట్రెండ్ అంటాం. అలా, అప్పట్లో, పైన మనం అనుకున్న పద్యరూప అనువాదాల, శతకాల పరంపర నడిచింది.

నిజానికి, అనువాదం మూలాన్ని వందశాతం పాఠకుడికి అందజేయదు, కాస్త అటో ఇటో త్రాసు మొగ్గుతుంది – అనువాదకుని స్థాయినిబట్టి. అనువాదకుడు విరివిగా తన స్వేచ్ఛను వాడుకున్నపుడు మూలాన్నిమించి ఉదాత్తమై నిలిచిన రచనలున్నాయ్. అనవసరపు విచలనాల వలన స్వేచ్ఛ లోపంగా పరిణమించిన సందర్భాలున్నాయ్.

"అనువాదానికి కట్టడులుంటాయి. మూలగ్రంథ కర్త నడిచిన దారికి అనువాదకుడు విధేయుడు కాక తప్పదు. అనువాదకుడు ప్రతిభాశాలి అయినపుడు, మూలానికి విధేయుడిగా ఉంటూనే స్వీయ ప్రజ్ఞను ఉజ్జ్వలంగా ప్రకాశింపజేస్తుంటాడు" – శ్రీ పోరంకి దక్షిణామూర్తి (అదొక్కటి తెలుసుకో, చాలు). ఐతే, ఈ ఔగాముల పరిశీలన అటుంచి, ఒక భాష నుండి మరో భాషకు భావ వినిమయం జరిగేందుకు, ఉన్నత రచనలు అందుబాటులోకి తెచ్చేందుకు, రచనలవిస్తృతి మరింత పెంచేందుకు అనువాదాలు తప్పనిసరి. అందుకే, శ్రీ పరమయ్యగారు అనువాదాలను సమాంతరంగా కొనసాగించారు. అందులో నాకు అందుబాటులో ఉన్నవి ఇవి:

1) ఆత్మబోధము : ఇది ఆది శంకరుల కృతి. గతములో అల్లంరాజు సుబ్రహ్మణ్య కవి; ప్రజ్ఞానంద ఘనేంద్రస్వామి తెనిగించినట్లు తెలుస్తోంది. పరమయ్య గారు 68 మూల శ్లోకాలను వాటి దిగువన పద్యానువాదాలు ప్రచురించారు. వేదముల వాకిళ్ళు తెరచి, వాటిలోని దివ్యజ్ఞానాన్ని లోకంలో వెదజల్లేందుకు 'ఆత్మబోధం' తాళం చెవి అంటారు. ప్రతి శ్లోకానికీ ఒక ఉపమానం చెప్పటం ద్వారా తేలికగా అర్థమవుతుంది. తత్త్వబోధ, భజగోవిందం, వివేకచూడామణి వంటి ఇతర ప్రకరణ గ్రంథాలవలే ఎంతో విశిష్టమైనదీ గ్రంథం. తిరుపతి వేంకట కవులు 'కలగూరగంప' (1956)లో కూడా ఆత్మబోధము అనువాద పద్యాలు కనిపిస్తాయి.

2) ముకుందమాల : కులశేఖరుని ముకుందమాలను ప్రతితరంలో కవులు అనువదిస్తూనే ఉన్నారు. ఇప్పటికీ అనేక అనువాదాలు వస్తున్నాయి. వీరు ఈ గ్రంథాన్ని కూడా మూల శ్లోకం దిగువన తెలుగు పద్యాలతో ప్రచురించారు. శ్రీరామునికి అంకితమిస్తూ సజ్జనకర్ణరసాయనమ్ముగా ఈ మహనీయ కృతిని అనుగ్రహింపుమని ప్రార్థిస్తాను.

3) చారుచర్య : క్రీ.శ. 1029-64 వరకూ కాశ్మీరదేశాన్ని పాలించిన అనంతవర్మ ఆస్థానకవి క్షేమేంద్రుడు. ఇతనికి వ్యాసదాసు అనే పేరుకూడా ఉంది. చారుచర్య, నీతికల్పతరు, చతుర్వర్గసంగ్రహ, దర్పదళన, సేవ్యసేవకోపదేశ, లోకప్రకాశ, స్థూపవదన ఈయన వ్రాసిన సందేశ గ్రంథాలు.

వందపద్యాల ''చారుచర్య''లో ప్రతి పద్యం ప్రత్యేకమైన సందేశాన్నిస్తుంది. మొదటి రెండు పాదాలు నీతిని బోధిస్తే చివరి రెండు పాదాలు తదనుగుణమైన ఉదాహరణను పురాణాలు, ఇతిహాసాలలోని పాత్రల ద్వారా ప్రస్తావిస్తాయి.

ఉదాహరణకు **"అన్యకాంతల వంచించు టనుచితంబు"** అనే సందేశం ఇచ్చే పద్యంలో మూడు, నాలుగు పాదాలలో రావణుని దృష్టాంతాన్ని గుర్తుచేస్తారు. మద్యవశులై యాదవులు నశించుట; శిష్ట జనులతో స్నేహానికి విభీషణుడు; బలి చక్రవర్తి దానం; విదురుని హితవాక్యాలు వినని కౌరవుల పతనం - ఇలా అనేక నీతులు అనేక పాత్రల ద్వారా చెబుతారు. ఒకో పద్యం ఒకో పురాణ ఘట్టాన్ని జ్ఞప్తికి తెచ్చి అనేక కథలు, గాథలు స్ఫురణ కొస్తాయి.

ఈ పద్యం చూడండి:

ఆప్తుల వియోగ దుఃఖంబులందు ధైర్య

మూనవలయును దీనత్వముజ్జగించి

మున్ను ద్రోణుడశ్వత్థామపొలియు వార్త

నాలకించి ధైర్యమ్మేది హతుడు గాడె?

వీరి ఇతర పుస్తకాలకు ఎటువంటి ముందు మాటలూ లేవు, ఈ చారుచర్యకు తప్ప. శ్రీ పులవర్తి నూకాల రాయశర్మ నాలుగు మాటలు వ్రాస్తూ అనువాదము మూలమునకు ఏమాత్రము తీసిపోని రీతిలో ఉందని "చారుచర్య"ను ప్రశంసించారు.

మూలము:

బ్రహ్మే ముహూర్తే పురుషః

త్యజేన్నిద్రా మతంద్రితః।

ప్రాతః ప్రబుద్ధం కమలం

శ్రయేత శ్రీర్గుణాశ్రయా।

అనువాదం:

బ్రహ్మ సమయంబునందె లేవంగవలయు

నిదురలోనుండి మనుజుడు నియతితోడ

ఆశ్రయించు గుణాశ్రయమైన లక్ష్మి

ప్రాత రభినవ వికసితాబ్జమునె రక్తి.

చివరి పద్యంలో ఎప్పటిలా వినమ్రంగా పరమయ్యగారిలా చెప్పుకున్నారు:

చారు చర్యా ఖ్యమై బుధ శ్రావ్యమైన
కావ్యమియ్యది క్షేమేంద్రకవి రచించె;
దెనుగు సేసితి శక్తివంచనము లేక
తత్ జ్ఞు లిది మెచ్చినపుడె సార్థకత నాకు.

4) పార్వతీ కళ్యాణము : గోస్వామీ తులసీదాసు వ్రాసిన ఈ గ్రంథాన్ని గతంలో జన్నాభట్ల వాసుదేవ శాస్త్రి (గుంటూరు) తెలుగులో అనువదించినట్లు (పద్యాలుగా) తెలుస్తోంది. పరమయ్య గారు 19 పేజీల చిన్నకథగా వ్రాసి అనుబంధంగా "మాతృకా మణిమాలిక" పేరిట 50పద్యాలలో అమ్మను కీర్తించారు. వీటిలో కొన్ని పద్యాలలో అమ్మ నామాలతో మూడు పాదాలు నడిపించి చివరి పాదంలో తెలుగులో వేడుకుంటారు ఇలా:

ఉద్య దాదిత్య తేజో మయూఖ వర్ణ!
బ్రాహ్మి! బ్రాహ్మణ వత్సలా! భాను జనని!
శ్యామలా! శ్యామలాకార! సప్త జిహ్వా!
నీ కటాక్షమ్ము నాయందు నిలుపు మమ్మ.

మరో పద్యంలో ఆది శంకరుల మార్గంలో

"ముద్ర లెరుగ, బీజాక్ష రమ్ములును రావు,
జప విధానము సున్న, యర్చన విధాన
మంతకన్నను దెలియ దట్లయ్యు నమ్మి
బ్రతుకు చున్నాడ నీ మాతృ భావమెంచి.

5) తిరువల్లువరు : శ్రీ పూర్ణ సోమసుందరము హిందీమూలాన్ని చిన్నకథగా వ్రాశారు పరమయ్య గారు. వల్లువరు తన పుస్తకాన్ని వ్రాసిన ఛందస్సును తమిళ భాషలో "కురళ్" అంటారు. అతని గ్రంథాన్ని "తిరు కురళ్" అంటారు – అంటే కురళ్ ఛందస్సులో పవిత్ర గ్రంథం అని అర్థం.

వల్లువరు వ్రాసిన గ్రంథాన్ని "తిరువల్లువరు" – జ్ఞానియైన వల్లువరు అంటారు. 2660 పంక్తులుగల ఆ గ్రంథము నాటినుండి నేటి వరకూ తమిళ భాషలో సాటిలేనిదిగా గౌరవింపబడుతోంది. ఎన్నో ఇతర భాషలలోకి అనువదింపబడింది. దీనిని "సత్యవాణి" అని వ్యవహరిస్తారు. అన్ని మతాలవారు తమదిగా ఆదరిస్తారు. ఆ కథంతా మనకు సరళమైన భాషలో అందించారు పరమయ్యగారు.

కథలో 'ఏలేల సింగన' 'వల్లువరు'ని మానవజాతికి సత్యమార్గము చూపు దీపశిఖ అగునట్లు ఓ గ్రంథం వ్రాయమని కోరుతాడు. అపుడు వల్లువరు అన్న మాటలు పరమయ్యగారు వారి రచనా వ్యాసంగం గురించి మనకు చెబుతున్నట్లు అనిపిస్తుంది – "భగవంతుని దయ వలన నేను జీవితమునకు సంబంధించిన ఎన్నో సమస్యలు గమనించి యుంటిని. పెద్దల ఉపదేశములు చదివితిని, వింటిని. చిన్నల వలన, పెద్దల వలన ఎంతో కొంత నేర్చుకుంటిని. ప్రతి దానిని విమర్శించుకొంటిని. ఈ అనుభవము వలన ఇతరులకు లాభము కలుగునని మీరన్న ఎడల మంచిదే. నేనొక చిన్న గ్రంథము వ్రాయుదును. జీవితములో నేను నేర్చుకొన్న దానిని అందరికీ పంచి పెట్టుట నా ధర్మము".

పరమయ్యగారి బాల్యంలో వారింటి ప్రక్కన ఒక తమిళ కుటుంబం నివసించేది. ఆ ఇంటిపెద్ద డెబ్భైఏళ్ల తాతగారు వీరింటికి వచ్చి భాస్కర రామాయణం చదివేవారు. వారినోట విని ఉంటారీ విషయాలన్నీ.

ఇవికాక, భాస మహాకవి విరచితమైన మధ్యమ వ్యాయోగము, దూత వాక్యము, అభిషేకము, బాల చరితము అనే నాలుగు నాటకాలను అనువదించారు. భాస నాటకాలను అంతకు ముందు సుప్రసిద్ధ సాహితీ మూర్తులు దీపాల పిచ్చయ్యశాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహం తెలుగులో నాటకాలుగా వ్రాశారు.

6. కబీరు సూక్తులు: ఇది 2014లో ముద్రణ పొందింది. అరవై అధ్యాయాలుగా విభజించి అన్వేషణము, గురువు, సత్సంగము మొదలైన శీర్షికలతో ఒక్కో అంశంపై ఒకటి రెండు పుటలకు మించని విషయ చర్చ చేశారు. కబీర్ భక్తితత్త్వాన్ని అవగతం చేసుకోడానికి పరామయ్యగారి పుస్తకం ఉత్తమ పరికరమని చెప్పవచ్చు.

7. నామ సుధ: నామదేవుని సూక్తులను "భగవంతుని సర్వ శక్తిమత్త్వము" అనే ఉప శీర్షికతో అనువదించి పరమయ్యగారు 2015లో ప్రచురించిన గ్రంథమిది. పై పుస్తకంలాగే ఇందులో 83 అంశాలను పొందుపరిచారు.

8. గౌడ పాదీయ కారికలు: "మాండూక్యోపనిషత్"కు ఆదిశంకరుల వ్యాఖ్యానం ఆధారంగా శ్రీ గౌడపాదాచార్యులు చేసిన రచనకు పరమయ్యగారి అనువాదమిది. ఆగమ, వైతథ్య, అద్వైత, అలాతశాంతి ప్రకరణాలు, భాష్యకారక కర్తృక వందనం, భాష్యకార మంగళాచరణం అనే ఆరు అధ్యాయాలు, చివరలో ఆది శంకరుల 'రత్నమాల' శ్లోక, తాత్పర్య, వ్యాఖ్యానాలతో మనకు ఈ పుస్తకంలో లభిస్తాయి. రత్నమాలలో అన్వయ క్లిష్టతకు అవకాశంలేని అందమైన పద్యాలు దొరుకుతాయ్.

మొదటి పద్యం ఇది:

ఎన్నఁడు నెట్టి జీవమున కెగ్గొనరింపకు మెల్ల వేళలన్
మన్నన సేయు మెల్లరను మంచిది సుమ్మిది మానవాళికిన్
చిన్నవికాదెల్లరకును జేతుల మోడ్చువె దాని ముందటన్
అన్నిటికన్న ముఖ్యమగు నట్టిది ధర్మ మొకండె ధారుణిన్.

ఈ పుస్తకం ప్రారంభంలోని శాంతిపాఠంలో

"భద్రం కర్ణేభిః శృణు యామ దేవాః
భద్రం పశ్యేమాక్ష భిర్యజత్రాః
స్థిరైరంగైస్తుష్టు వాగం సస్తనూభి
ర్వ్యశేవదేవహితం యదాయుః" లో ఆశించినట్లు –

ఓ దేవతలారా! మేము చెవులతో మంగళవాక్కులు విందుము గాక! యజ్ఞకర్మము నందు సమర్థులమై శుభమును దర్శింతుము గాక! స్థిరమైన అవయవములతోను, శరీరములతోను స్తోత్రము చేయు మేము దేవతలకు హితముగా జీవింతుము గాక! ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాపములు శాంతించును గాక! – ఈ మంగళములన్నీ పాఠకులకు చేకూరాలని పరమయ్యగారి ఆశ.

***

ముగింపుకి కాస్త ముందు...

ఇంతవరకూ పరమయ్యగారు చెప్పిన విషయాలను గురించి ఆయా గ్రంథాల నేపథ్యంలో కొంత కొంత తెలుసుకున్నాం. మరికొన్ని సంగతులూ ముచ్చటించుకుందాం:

➤ పరమయ్యగారిలో అబ్బురపరిచే అంశం "సమ దర్శనం". ఇది కాస్త అరుదైన సంగతే. రచన ఆదిశంకరులదైనా, తులసీదాసు, కబీరు, కులశేఖరులు, క్షేమేంద్రుడు, భాసుడు, తిరువల్లువరు... ఇలా ప్రాంతం, భాషలకు అతీతంగా ఆధ్యాత్మిక సాహిత్యమంతటినీ అధ్యయనం చేశారు. పద్యరచనే కాదు అప్పుడప్పుడూ వచన కవిత్వాన్ని, గేయాలను వ్రాశారు. వాటి రుచి మనకు 'మల్లికా మాలిక'లో తెలుస్తుంది. సాధారణంగా సంప్రదాయక వాతావరణం నుంచి వచ్చిన కవులు పురాణాలలో చెప్పబడిన దేవతామూర్తులు, అవతారాల గురించి తప్ప ఆధునిక యుగంలో ప్రాచుర్యం పొందిన దేవుళ్ళను గురించి పెద్దగా విశ్వాసం ప్రకటించరు. కానీ పరమయ్యగారు 'సాయిబాబా', 'మెహర్ బాబా'లకూ అపరిమిత భక్తితో అక్షరార్చన చేశారు.

➤ మరో లక్షణం సమయోచిత భాష. ఉదాహరణకు వేర్వేరు పుస్తకాలలో వాక్య నిర్మాణం ఎలా ఉందో చూద్దాం:

తిరువల్లువరు కథలో **"ఒకానొక నగరములో ధనము, గౌరవము గల యొక వ్యక్తి గలడు, అతని కొడుకు యువకుడు. అతడు అల్లరి మూకతో బజారులో తిరుగు చుండెను".** కబీరు సూక్తులు, నామ సుధ, గౌడ పాదీయ కారికలు వీటిలోనూ దాదాపు ఈ తరహా భాషే.

ఇక 'బాలచరితం' పౌరాణిక నాటకం (మూలం: భాస మహాకవి). అందుకే సంభాషణలు ఆ స్థాయిలో ఉంటాయి. **"పుత్రీ! పుత్రీ! నీవు మా**

ఇంట లక్ష్మివై విహరింపక ఈనాడు మమ్ములను విడిచిపెట్టి పోవుచున్నవా! ఈ సమయమున బహు శత మహిషముల భాతి చీకటి గడ్డకట్టి యున్నది”. నాటకంలో అధికభాగం సీస పద్యాలు. మరి పాడుకోడానికి, పాత్రధారులు ప్రేక్షకులను తమ రాగంతో మంత్రముగ్ధులను చెయ్యడానికీ ఇవి అనువైనవి కదా! “పార్వతీ కళ్యాణం” కూడా ఇదే రీతిలో సాగుతుంది.

- అన్నీ చిన్న చిన్న పుస్తకాలు. 24 లేదా 32 పేజీలు. ఒకటి రెండు పేజీలు చివరలో మిగిలితే, వాటిని అసందర్భాలతో కాకుండా పాఠకుల పారాయణకు ఉపకరించేలా చక్కని ఒక స్తోత్రాన్నో, మంచి పద్యాలనో ముద్రించారు. చాలావరకూ పుస్తకాలలో వారి సతీమణి సూర్యకాంతంతో కలసి ఉన్న ఫొటో, చివరపేజీలో సంక్షిప్తంగా వారి వివరాలు, వెనుక అట్టపై గ్రంథాల వివరాలు – ఇలా అన్ని పుస్తకాలూ దాదాపు ఒకే విధంగా ఉంటాయి. నా వద్ద ఉన్నవాటిలో కబీరు సూక్తులు, గౌడ పాదీయ కారికలు, నామ సుధ కాస్త పెద్ద పుస్తకాలు.

‘చారుచర్య’ పుస్తకంలో ఎంతో విలువైన సమాచారం లభిస్తుంది. అనేక పురాణ పాత్రలు, సంఘటనలు ఏ పురాణాల్లో తారసపడతాయో జాబితాగా ఇచ్చారు. రామాయణ, భారతాలలో పాత్రలు మనకందరికీ సుపరిచితమే. వాటితో పాటు లింగపురాణం, హర్షచరిత, హరివంశము, కథా సరిత్సాగరము వీటి పరిచయమూ కొంత కలిగిస్తారు.

- పరమయ్యగారి అనువాదాలు ఇతర కవుల అనువాదాలు, పుస్తకాలతో పోల్చినపుడు కొంత ప్రత్యేకమైనవిగా భావించాలి. ముందుగానే చెప్పినట్టు ఇవి ఏదో ఒకటి వ్రాయాలని వ్రాసినవి కావు. గురువుల వద్ద సంస్కృత కావ్యాల అభ్యాసం, ఇతిహాసాల అధ్యయనం, భారతీయ భక్త కవులందరి సాహిత్యాన్నీ పరిశీలించడం, పురాణాలపై అవగాహన, మూడు

దశాబ్దాల బోధన, సమకాలీన సాహిత్య పరిశీలన – వీటన్నిటినీ సమన్వయం చేసుకున్న ఒక సమగ్ర సాహితీమూర్తి అంతర్వీక్షణలో బహిర్గతమైన భావాలు ఇవి. అందుకే ఈ చిన్న చిన్న పుస్తకాలలో ప్రతిపదంలో ఔన్నత్యం, లోతూ జమిలిగా కనిపిస్తాయ్.

➤ ఏది వ్రాసినా శరణాగతినే కాంక్షించారు. తాను నిమిత్త మాత్రుడననే ఎరుకను వీడలేదు. “తెలిసినంతలో లోపమ్ము గలుగకుండ” ఇవన్నీ రాస్తున్నానంటూ వినమ్రత ప్రదర్శించారు. నీవు స్వీకరించి మన్నించిన నాకు సిద్ధి అని పరమాత్మకే సవినయ సమర్పణ చేశారు. ఇలాంటి భావంతో వ్రాసిన ఓ పద్యం :

ఈ పాపడు గావించిన
పాపమ్ములు పరిహరించి పాలింప గదే
ఆపదలను ద్రోపాడెడు
నీ పదములె దిక్కు నాకు నిత్యము జననీ! రెండుసార్లు చదివితే నోటికి రాదూ!

➤ **కలలో నైనను నిన్ను నేను మఱవంగ రాదు నీ నామమే తలపంగా వలె నీదు స్ఫూర్తియది నిద్రన్ గూడ గాఢమ్ముగా నలరంగావలె** – అన్నిటా కాస్త అటూఇటూగా ఇదే కోరిక.

“అచ్చమగు నాత్మవిజ్ఞానమిచ్చి నాదు పేరు పెంపు సార్థకమయి వెలయునటులు దేవ! పరమత్వమును బ్రసాదింపుమయ్య” తల్లి తండ్రులు పెట్టిన పేరును సార్థకం చెయ్యమని జగత్పితను కోరడం ఎంత నేర్పరితనం.

➤ తల్లీ నిన్ను దలంచి అని పోతనగారు ప్రార్థించినట్లు **“నీవే నా రసనాగ్ర భాగమున దంష్ట్రీ నిల్చి సద్భావముల్ తీవల్ సాగగ బల్క జేయుము”** అంటారు.

➤ ఇంతకు ముందు ఎవరూ ఇలా చెప్పలేదు అనలేం గానీ, మిగిలినవాళ్ళు ఇంత సరళంగా చెప్పలేదు సుమా! అని మాత్రం అంటాం, కొన్నిసార్లు. ఈ పద్యం చూడండి:

చేయి గదలుప నీ పద సేవ యగుత
వాయి మెదలుప నీ స్తుతి వాక్య మగుత
చూపు చూచిన నీ దివ్య రూప మగుత
రమ్య గుణ సాంద్ర! శ్రీ రఘు రామచంద్ర.

➤ "మతము పేరుతోడ మతిహీనతను జెంది మసలుచుండు గాని మానవుండు" "సర్వ మతములకును సామాన్యధర్మమౌ మంచితనము మాట మరచునేల?" వంటి మంచి మాటలు అవకాశమున్న ప్రతిచోట చెప్పారు.

ఇన్నిచదివినా, ఇన్ని వ్రాసినా, ఇదంతా ఇంత నిష్కామకర్మగా భావించి పెద్దాపురం దాటి పరమయ్యగారు పెద్దగా తెలియకపోవడానికి కారణం వారు కేవలం అర్థాన్ని కాక, పరమార్థాన్ని చదువుకున్నారు. అందుకే తాపత్రయాలకు దూరంగా ఉన్నారు. 'కబీరు సూక్తులు'లో వ్రాసినట్లు **"హృదయమును పాండిత్యము బండరాయిగా చేసి రచన ఇటుక రాయిగా చేస్తుంది. వీటివలన దివ్య ప్రేమ హృదయంలో ప్రవేశించదు. ప్రేమయను పదమొక దానిని గ్రహించినవాడే నిజముగా విద్యావంతుడు. ఈ పదము నీలోనే కన్పించును గానీ గ్రంథములలో కాదు".** అందుకే పరమయ్య సాహిత్యకారునిగా కంటే సాధకునిగానే ఎక్కువ కృషి చేశారు. మరి ఇవైనా ఎందుకు వ్రాయడం? అని ఎవరైనా అడిగితే ఒక మాట చెబుదాం – **ముందుగా నడిచినవారు కొన్ని గుర్తులుంచకపోతే వెనుక వచ్చేవారు దారి తప్పే ప్రమాదం ఉంది.**

బసవరాజు అప్పారావుగారి కవిత్వాన్ని గూర్చి చెబుతూ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు "అప్పారావు కవిత్వం వల్ల ఏమి ప్రయోజనం అంటే ఏమిచెప్పను? అతని కావ్యాలన్నీ చదివాక నిట్టూర్పు విడువకుండా, కన్నీటితో చెక్కులు తడియకుండా ఉండలేము. ఆ కన్నీటికెంతటి శక్తి ఉంది? ధూళీ దూగరా లేకుండా శుభ్రంగా, శాంతంగా, సుందరంగా, వాన వెలిసిన తరువాత చెట్టులాగా, చల్లని ఆవేశంతో రవంత ఊగుతూ నిలబడతాము" అంటారు. పరమయ్య గారి గ్రంథాలూ అంతే. శుభ్రంగా, శాంతంగా, సుందరంగా ఉంటూ చల్లని ఆవేశంతో ఊగేలా చేస్తాయ్.

అందుకే, నిష్కామకర్మగా సాహితీ వ్యాసంగం కొనసాగించిన ఇలాంటి మహనీయుల పుస్తకాలను గర్భగుడిలోని మూలవిరాట్ స్వరూపాన్ని చూస్తున్నట్టు నిర్మలమైన కళ్ళతో దర్శించాలి, చేతులు జోడించి. కాసేపటికి అలౌకిక ఆనందంతో అసంకల్పితంగా ఆ చేతులు కళ్ళనుండి చెంపల దాకా వెళ్ళాలి. అలాకాకుండా, ఏవేవో అన్వయాలతో, వెతికిపట్టుకున్న అలంకారాలు, ఎంచుకున్న వృత్తాలు, ఇతర ఔచిత్యాలు గురించి చర్చించుకుంటూ ఉంటే కవికి అవసరమనిపించని అంశాలేవో మనం పనిగట్టుకు అతికినట్టవుతుంది.

వీరి పుస్తకాలన్నీ శ్రద్ధగా గమనిస్తే తెలిసే విషయం ఒకటి. ముఖ చిత్రాలు, ముద్రణ, ఉపయోగించిన కాగితం... ఎటువంటి ఆర్భాటాలు లేకుండా వారంత నిరాడంబరంగానే ఉన్నాయ్. కవిత్వమూ అంత అచ్చంగా, స్వచ్ఛంగానే ఉంటుంది. పాండితీప్రకర్ష వ్యక్తమయ్యేలా నూతన విన్యాసాలను చేసే ప్రయత్నం, కృత్రిమత్వం ఎక్కడా కనపడవు. (ఎక్కడైనా అరుదైన పదం పద్యంలోకి చేరింది అనిపిస్తే వాటికి దిగువన అర్థం కూడా అందించారు) ఇక ప్రాసంగికత అంటారా ఆత్మ, పరమాత్మల సంలీనానికి మాధ్యమమైన ఆధ్యాత్మిక సాహిత్యం కాలాతీతమే!

చివరగా...

అవతార్ మెహర్‌బాబా అంటారు – The aim of life is to love God. The Goal of life is to become one with God" ఈ ఆశయ సిద్ధి, లక్ష్యసిద్ధి పరమయ్యగారు పొందారన్నది నిర్వివాదాంశం.

పరమాత్మపట్ల పరిమితిలేని ప్రేమయే పరమయ్యగారిని ఈ మార్గంలో పయనింపజేసింది. పెద్దలన్నట్లు ప్రేమతత్త్వమే లౌకిక వాసనల మాలిన్యం అంటకుండా ఉదాత్తతను పొంది భగవంతుడి మీద నిలిచినప్పుడు అది భక్తిగా పిలువబడుతుంది. భక్తికి బీజం పూజ్య పూజక భావం. సాధన ప్రథమ దశలో భగవంతుడు పూజ్యుడు అని; తాను పూజకుడిని అని మనసులో ఉంటుంది. క్రమ క్రమంగా సిద్ధావస్థకు చేరేసరికి అభేద స్థితి కలుగుతుంది. ఆ దశలన్నీ దాటిన అవధూత ఆయన.

పరాతత్త్వ అన్వేషణలో సాగిన పరమయ్యగారి పయనంలో
జిజ్ఞాస దారి దీపమైంది
పూర్వకవుల మార్గదర్శనముంది
అందుకే, అడుగులు కొన్ని పద్యాలైనాయ్
ఆ పద్యాలు గ్రంథాలై సాధనామార్గపు మైలురాళ్ళుగా నిలిచాయ్.

అక్కడ కాసేపు మజిలీ చేద్దాం, వారు పొంది మన ముందుంచిన దానిలో కొంత అందుకునే ప్రయత్నం చేద్దాం.

- ఇతి శివమ్

మా గురుదేవులు

– డా. జోస్యుల కృష్ణబాబు

అవును! నిజంగా ఆయన గురుదేవులే. ఆచార్య: పూర్వ రూపమ్ – అంతేవాస్యుత్తరరూపమ్–విద్యా సంధి: –ప్రవచనమ్ సంధానమ్, అనే ఉపనిషద్వాక్యాలకు అచ్చమైన ఉదాహరణ పరమయ్యగారు, వారి శిష్యులమైన మేమూ. జీవితమంతా ఒక క్రమశిక్షణతో ఉన్నతమైన విలువలతో జీవించారాయన.

గురువుగారి ప్రతిభ గురించి ఓ విషయం చెప్పాలి. వారు ఎస్.ఎస్.ఎల్.సి.లో ఉత్తీర్ణులయ్యాక వయసు సరిపోక భాషాప్రవీణ రెగ్యులర్ గా చదివే వీలులేక ప్రైవేటుగా చదివి, కంఠదఘ్నిగా కావ్య శాస్త్రాల్ని ఔపోశన పట్టి పూర్తిచేశారు.

శ్రీ పరమయ్యగారి వద్ద లూథరన్ హైస్కూలులో నేను ఎనిమిది, తొమ్మిది, పది తరగతులు చదువుకున్నాను. తెలుగు పట్ల ఇంత మక్కువ ఏర్పడడానికి పరమయ్యగారే కారణమైనా, వారంటే ఎంతో భయం.

మాస్టారి కంఠస్వరం చాలా నెమ్మది. మనిషి కూడా నెమ్మదే.కానీ, తెలుగు ఉపాధ్యాయుల్లో క్లాసును ఇంత కంట్రోల్‌లో పెట్టే వ్యక్తుల్ని ఎక్కడా చూడలేదు. ఆయన్ని చూస్తే ఎలాంటి విద్యార్థులైనా గడగడలాడేవారు. ఇక ఇన్విజిలేటర్‌గా వీరు పరీక్ష హాలులోకి అడుగుపెడితే ఏ విద్యార్థి అయినా తలతిప్పకుండా పరీక్ష రాసుకోవలసిందే. ఎవ్వరినీ ఎప్పుడూ కొట్టిన దాఖలాలు లేవు, తిట్టడమూ చూడలేదు. నిర్మలంగా మృదుసంభాషణ చెయ్యటం వీరికున్న సహజ లక్షణం. అల్లరి చేసే విద్యార్థుల్ని కళ్ళతోనే నియంత్రణ చేసేవారు.

తోటి ఉపాధ్యాయులు, హెడ్మాస్టారు కూడా పరమయ్యగారితో చాలా గౌరవంగా మెలగేవారు. తమ క్లాసు తరువాత పరమయ్యగారి క్లాసు ఉంటే

బోర్డుమీద ఏరాతలూ ఉంచేవారు కాదు. ఆయన చెరపాల్సి వస్తుందన్న ఆలోచన కొంతైతే, అక్షర దోషాలేవైనా దొర్లితే ఆయన దృష్టిని తప్పించుకోలేమన్న భావన కొంత.

మాష్టారిది చాలా సునిశితమైన దృష్టి. బల్ల దగ్గర నిలబడి నోట్స్ చెబుతున్న ఆయన, దూరంగా కూర్చుని రాసుకుంటున్న విద్యార్థిని ఒక్కసారి లేపి 'చూడబ్బాయ్! నువ్వు విద్య అన్నప్పుడు ఒత్తు పెట్టినట్టున్నావ్' అనేవారు. అంతే! ఒక్కసారి ఆ కుర్రవాడితో పాటు అంతా ఆశ్చర్యపోయేవారు. వాడు నిజంగానే ఒత్తు పెట్టేవాడు. అంటే, విద్యార్థుల చేతిరాతల కదలికలని బట్టి వాళ్ళు తప్పు రాస్తున్నారా? ఒప్పురాస్తున్నారా? అన్న విషయాన్ని ఆయన ఇట్టే గ్రహించే వారు.

పాఠం చెప్పేటప్పుడు ఎవరైనా నవ్వుతోన్నా, మాట్లాడుతోన్నా అస్సలు నచ్చేది కాదు. ఇపుడు ఒకరు మాట్లాడారు, వాళ్ళెవరో నాకు తెలుసు, వాళ్ళకూ తెలుసు, వాళ్ళు నించోవాలి అనేవారు. అసలు మాట్లాడిన వాడేకాక, మాట్లాడానేమో అన్న అనుమానం ఉన్న మరో ఇద్దరు ముగ్గురు కూడా లేచి నిలబడిపోయేవారు. అసలు వాడు గనుక లేవకపోతే అప్పుడు వాడి దగ్గరకు వెళ్ళి నీకు బుద్ధుందా? లే! అనేవారు. వాడు బెంచి ఎక్కాల్సిందే. అంతేకాదు ఏ విద్యార్థి అయినా కొంచెం తేడాగా మాట్లాడితే "నీలో నువ్వుండి మాట్లాడు" అనేవారు. ఆయన దగ్గర చదువుకొన్న చాలామంది విద్యార్థులు చర్విత చర్వణంగా ఈవాక్యాన్ని తలచుకొంటూ ఆయన్ని గుర్తుచేసుకొంటారు.

మాష్టారిలో కనిపించే మరో లక్షణం, ఆయన ఏదైనా ఒక రోడ్‌ని క్రాస్ చేసేటప్పుడు ముందు తిన్నగావెళ్ళి, అప్పుడు తాను మళ్ళాల్సిన దిశకు మళ్ళేవారు. ఒక్కసారి కూడా ఈ పద్ధతిని ఆయన అతిక్రమించటం చూడలేదు.

ఇక, గురువుగారు అక్షరదోషాల్ని అస్సలు సహించేవారు కారు. పేపర్లు దిద్ది ఇచ్చినపుడు వాటినిండా ఎర్రఇంకుతో అండర్లైనులు, కొట్టివేతలే ఉండేవి. మా సహపాఠి ఒకతనికి అస్సలు అక్షరాలు రాయడం చేతనయ్యేది కాదు. వాక్యాల కూర్పు కుదిరేది కాదు. కానీ, పేపరు నిండా ఏదో రాసేసేవాడు. మాస్టారికి చెప్పి చెప్పి, దిద్ది దిద్ది ఇక విసుగొచ్చింది. ఒకసారి అతను రాసిన పేపరు అతనికే ఇచ్చి అబ్బాయ్ నువ్వు చాలా రాసావు, కానీ నాకు అర్థం కావడం లేదు. రాసిన వాడవు నువ్వే కాబట్టి నీకర్థమవుతుంది. నువ్వు చదువు, నీ ఎదురుగానే మార్కులేస్తాను, అని పేపరు చేతికిచ్చారు. వాడి నోట మాటలేదు. వాడికి మాత్రం అర్థమయితేగా, చదవడానికి.

నేను భాషాప్రవీణ చదివేరోజులలో వేసవిసెలవల్లో కావ్యాలంకార సంగ్రహం చెప్పించుకునేందుకు ఆయనవద్దకు వెళ్ళాను. మాష్టారు ఎంతో శ్రద్ధగా, ఓపికగా అందులోని రస ప్రకరణం, నాయక ప్రకరణము, విభావాను భావసంచారీ భావాల స్వరూప స్వభావాలు రెండు నెలలపాటు చెప్పారు. మాస్టారు మంచి చమత్కారి కూడా. రస ప్రకరణంలో అద్భుత రసాన్ని గురించి చెప్పి దాని స్థాయీభావము విస్మయము అంటూ దానికొక ఉదాహరణతో సమన్వయ పరిచారు. నేను కొంచెం అర్థంకాక ఆయన మొఖంలోకి అలా చూస్తూ ఉన్నాను. ఏం విస్మయంగా లేదూ! అంటే అర్థం కాలేదన్న మాట, అని మరొకసారి చెప్పారు. అపుడు నా మొఖం విస్మయంతో విప్పారింది.

కొన్ని నెలలు మాస్టారితో కలిసి పనిచేసే అదృష్టం కూడా దక్కింది. 1978లో భాషాప్రవీణ పూర్తయ్యాక, పండిట్ ట్రైనింగ్ కి వెళ్ళడానికి మధ్య ఆరునెలలు ఖాళీకుదిరింది. ఆ సమయంలోనే లూథరన్ హైస్కూల్ లో తెలుగుపండిట్ పోస్టు ఖాళీ ఉండడంతో సెలవుఖాళీలో చేరి, పరమయ్య మాస్టారితో కలిసి పనిచేశాను. తెలుగు ఉపాధ్యాయుడు కేవలం పద్యాలకు,

కఠిన పదాలకు అర్థ తాత్పర్యాలు చెప్పుకుంటూ పోతే నెగ్గుకు రాలేదని, అతనిలో వినదగినవి, విని ఆలోచించదగినవి, ఆచరించదగినవి ఉన్నపుడు మాత్రమే అతడు తరగతిగది నుండి విజేతగా బయటకు రాగలడని ఆయన సాహచర్యంలో తెలిసింది.

మాస్టారి ప్రతి గ్రంథం ఆయన లోకజ్ఞతని, రచనా ధురీణతని చెప్పక చెపుతుంది. ఇక ఆకాశవాణి సరసవినోదిని సమస్యాపూరణానికి ఆయన క్రమం తప్పకుండా పద్యాల్ని పంపేవారు. ఇక ఆయన రాసిన "విచిత్రభారతం" గ్రంథంపై నా పర్యవేక్షణలో శ్రీమతి బొడ్డు స్వాతికుమారి ఎం.ఫిల్ చేశారు. మాస్టారి గ్రంథాలపై మరిన్ని పరిశోధనలు చేయించాలని నా ఆలోచన. అది త్వరలోనే నెరవేరగలదని ఆశిస్తున్నాను.

విశ్రాంత దశలో మాస్టారు ఇంటివద్దే భారత, భాగవత పురాణ ప్రవచనాలు చేసేవారు. ఆయన శిష్యులు, భక్తులు రోజూ సాయంత్రం వేళ వచ్చేవారు. కొందరు ఆయనను అవధూతగా భావించేవారు. నిష్క్రమణ పర్యంతం వారి అమృతవాక్కులను ఆస్వాదిస్తూ ఆయనను సేవించేవారు. మాస్టారిని తలచుకున్నపుడల్లా "జయంతితే సుకృతినో రస సిద్ధాః కవీశ్వరాః నాస్తి తేషాం యశఃకాయే జరా మరణజం భయం" అన్నశ్లోకం గుర్తొస్తుంది. మనిషి పుట్టటం ఎంత సహజమో మరణమూ అంతే సహజం. అయితే జనన మరణాల మధ్య వ్యక్తి సాగించిన ప్రస్థానమే ఆత్మీయుల గుండెల్లో నిలిచిపోతుంది. సుదీర్ఘ జీవితాన్ని యోగిలా గడిపిన మాస్టారు కైవల్య పదాన్ని పొందాక మా ఊరి రామారావుపేటలో వారి ఇంటి ముందు నుండి వెళుతుంటే వారు ఆ కుర్చీలో కూర్చుని ఏదో ప్రవచిస్తున్నట్లు, ఏదో రాసుకుంటున్నట్టు ఉంటుంది. మా గురువుగారి జ్ఞాపకాలు సదా నాతోటే ఉంటాయ్, నాతోనే నిష్క్రమిస్తాయ్.

***

శ్రీ పరమయ్య జీవితవిశేషాలు

జననము	:	తేది: 08.12.1931 ప్రజోత్పత్తి నామ సంవత్సర కార్తీక బహుళ చతుర్దశి, మంగళవారం.
తల్లిదండ్రులు	:	శ్రీ మధునాపంతుల వేంకట సుబ్బారావు, శ్రీమతి గౌరీ మాణిక్యాంబ.
గురువు	:	శ్రీ భమిడి సూర్య భగవచ్ఛాస్త్రి, శ్రీ ద్విభాషి సోమనాథ శాస్త్రి.
కవితా ప్రోత్సాహకులు	:	శ్రీ యక్కల వీరరాజు; శ్రీ ద్విభాష్యము వేంకటరావు.
ఉద్యోగము	:	తెలుగు పండితులు, లూథరన్ హైస్కూల్, పెద్దాపురం.
ఉద్యోగ విరమణ	:	1989 జులై 31
నిర్యాణం	:	2017 సెప్టెంబరు 07

రచనలు

1. చారుచర్య (మూలము: క్షేమేంద్రుడు)
2. ముకుందమాల (మూలము: శ్రీ కుల శేఖరులు)
3. ఆత్మ బోధ (మూలము: ఆది శంకరులు).
4. కబీరు ఉపదేశములు (మూలము: కబీరు).
5. నామ సుధ (మూలము: నామ దేవుడు).
6. పార్వతీ కళ్యాణము (మూలము: తులసీదాసు).
7. వినాయక చరిత్ర (మూలము: చర్ల భాష్యకార శాస్త్రి).
8. కుసుమ గుచ్ఛము.
9. నివేదనము
10. చంద్రోదయము
11. గురుగీతము
12. లక్ష్మీ హృదయము (సంస్కృతము నుండి అనువాదము).
13. దేవీ స్తోత్రము.
14. ప్రేమ ప్రచారకుడు – శ్రీ సాయి పాదానంద (ఆంగ్ల మూలము: శ్రీ రంగస్వామి పార్థసారధి)
15. భాస నాటకముల అనువాదము :
    i) మధ్యమ వ్యాయోగము ii) దూత వాక్యము
    iii) అభిషేకము iv) బాల చరితము
16. విచిత్ర భారతము.
17. గౌడ పాద కారికలు.
18. శ్రీ దాసు ఉపదేశములు.
19. పూర్ణము – శూన్యము (శ్రీ మెహర్ బాబా)
20. మల్లికా మాలిక.
21. యోగిద్వయం (పరమయ్యగారి నిర్యాణం తరువాత ముద్రితం)

***

"పరమమ్"పై ప్రసిద్ధ సాహితీవేత్త శ్రీ మాకినీడి సూర్యభాస్కర్ స్పందన

ఈ 'పరమమ్' మణిబాబు నాలుగవ విమర్శ గ్రంథం. గతంలో ఆయన చేసిన ప్రసంగాలనీ, సమీక్షలనీ **'అన్నవి... అనుకొన్నవి'** అని, వజ్రాయుధ కవి డా. ఆవంత్స సోమసుందర్ సాహితీ సంస్పర్శను **'అందినంత చందమామ'**గాను, మళ్ళీకొన్ని ప్రసంగాలు, సమీక్షలను **'స్ఫురణ–స్మరణ'**గాను పుస్తకాలుగా తెస్తే, ఇదిగో ఇప్పుడు – శ్రీ మధునాపంతుల వేంకట పరమయ్య సాహిత్య జీవితాన్ని **'పరమమ్'**గాను తీసుకువచ్చారు.

కవిని లేదా కవిత్వాన్ని వైమర్శిక దృష్టి కోణంలో చూస్తున్నప్పుడు, మధ్యలో అప్పుడప్పుడు సాలోచనగా తర్కించుకుంటూ స్వగతంగా ప్రశ్నిస్తుంటారు, మణిబాబు. 'అందినంత చందమామ'లో అటువంటి సందర్భాలను ఉటంకిస్తూ "ఈ తాత్త్విక భావసంచయం ఈ అబ్బాయికి ఎక్కడినుండి అబ్బిందనిపిస్తుంది" అంటూ ఆశ్చర్యంతో ముచ్చటపడ్డాను. ఇప్పుడీ 'పరమమ్' పుస్తకాన్ని చదివితే, మణిబాబులో తాత్త్విక భావసంచయానికి తోడు ఆధ్యాత్మిక అనురక్తి కూడ బాగా ఉందని స్ఫురించింది. పరమయ్యగారి పుస్తకాల ప్రాసంగికత గురించి చెబుతూ "ఆత్మ పరమాత్మల సంలీనానికి మాధ్యమమైన ఆధ్యాత్మిక సాహిత్యం కాలాతీతమే" నంటారు మణిబాబు. ఇదీ ఆయన అత్యుత్తమ ఆధ్యాత్మిక అవగాహన.

వేంకట పరమయ్యగారు రాసిన కవిత్వమంతా ఇంచుమించు ఆధ్యాత్మిక భావశబలతతో కూడుకున్నదే. వారు తమ రచనలతో పేరు సార్థకం చేసుకున్నారు. పరాతత్త్వ మార్మిక ఆలోచనలతోనే తన జీవితాన్ని ఆయన గడిపారనడానికి ఆయన గ్రంథాలే ప్రబల సాక్ష్యం. ఆయన పేరుకూ జీవితానికీ ఎంత చక్కగా పొంతన కుదిరిందో అంత చక్కగానూ ఆయన కవితాధార్మిక జీవితాన్ని విశ్లేషించిన ఈ పుస్తకానికి మణిబాబు పెట్టిన పేరు కూడా అలాగే కుదిరింది. చాల బాగా నప్పింది.

మణిబాబు ఏమి రాసినా, ఒక ప్రణాళిక లేకుండా రాయరు. ఎవరైనా అంతే కదా అని మీరనుకోవచ్చు. ప్రణాళిక వేసుకున్నా, ఇతరుల విషయంలో అది రాతలోను, పుస్తకంలోను కనబడకపోవచ్చు. కానీ మణిబాబు విషయంలో

అలా కాదు. రాయడం, పుస్తకంగా మలచడం, డిటిపి, ముద్రణ ఇలా అన్ని దశలలోనూ ఆ ప్రణాళిక ప్రతిబింబిస్తుంది. 'ముగింపుకు కాస్త ముందు' అంటూ గ్రంథాన్ని ముగించడానికి ముందర ముందు వ్యాసాల్లో చెప్పడానికి కుదరని ఇంకొన్ని విషయాలు చెప్పి ఆ తర్వాత ముగించడం – ఇదంతా తాను వేసుకున్న ప్రణాళిక సైతం పాఠకుడికి అర్థమయ్యేలా ఉంటుంది. ఈ విధమైన రచన వర్ధమాన రచయితలకు బాగా ఉపయోగిస్తుంది.

సమయం సందర్భం తెలిపి, ప్రారంభ ఉపోద్ఘాత పరిచయ వ్యాసం తర్వాత పరమయ్యగారి పుస్తకాల్లోకి వెళతారు. వెళ్ళేముందు 'భక్తి తప్ప మరేమీ లేనితనం'గా పరమయ్యగారి జీవితాన్ని, సాహిత్యాన్నీ ఒక్క మాటలో తేల్చి చెప్పారు మణిబాబు. ఏడు దశాబ్దుల ఆయన దర్శనాన్ని దోసెడు పుస్తకాలుగా, అంటే 14 పుస్తకాలు ఇస్తే – వాటి నుంచి కొన్ని పుస్తకాల గురించి వివరించారు.

మొదటి 'గురుగీతము'. పద్యాలన్నీ సాయి సంబోధనతో నడిచినా, అవి సద్గురువు లక్షణాలను తెలియజెప్పేవే అంటారు అద్దం, దీపం, నీటి బుడగ, గడ్డిపోచ... అన్నిటా గురువుకు ఆపాదించగల విశేషాలను వెతికితీసి, ఎలా పద్యాలు అల్లిందీ బాగా వివరించారు. చివరికి యక్కల వీర్రాజు అనే గురువుకృప పొందిన ధన్యజీవిగా పరమయ్యగార్ని పేర్కొంటారు.

'మల్లికా మాలిక' అనే పుస్తకం గురించి వివరిస్తూ – "కొన్ని చోట్ల లలితా సహస్ర నామాలను యథాతథంగానూ, మరి కొన్ని చోట్ల వాటి అర్థాలను పద్యాలలో ఉంచడం వలన కొత్త పద్యాలను చదువుతున్న అనుభూతిని పాఠకుడు పొందలేడు" అని తెగేసి చెబుతారు. చెప్పవలసిన తావుల్లో ఖరాఖండిగా చెప్పగలగడం మంచి విమర్శలో ఒక భాగం. తరువాత ఇంకో విషయం ఏమంటే, చేతిలో పుస్తకం ఉంది కదాని, ప్రతి పద్యాన్ని వివరించడానికి పూనుకోలేదు. ప్రస్తావించగల పద్యాలు లేదా తనకు అలా అనిపించిన పద్యాల జోలికి మాత్రమే వెళ్లారు. అంతే కాకుండా, కొన్ని పద్యాలను ఉదహరిస్తూ అలాంటివి పుస్తకంలో అంత అర్హత లేకున్నా చోటు పొందా"యంటారు. ఇలాంటి పరిశీలనలే విమర్శకు సాధికారతను కూరుస్తాయి.

'నివేదనము', 'చంద్రోదయము' అనే మరో రెండు పుస్తకాలను పరిశీలించి శతక నిర్మాణంలో పరమయ్యగారి టెక్నిక్‌ను వివరిస్తారు.

తరువాత పరమయ్యగారి కొన్ని అనువాద రచనలను పరామర్శించారు. "నిజానికి అనువాదం మూలాన్ని వంద శాతం పాఠకుడికి అందజేయదు. కాస్త అటో ఇటో త్రాసు మొగ్గుతుంది - అనువాదకుని స్థాయిని బట్టి" అంటారు మణిబాబు. ఈ నేపథ్యంలో ఆత్మబోధము, ముకుందమాల, చారుచర్య, పార్వతీ కళ్యాణము, తిరువల్లువరు, కబీరు సూక్తులు, నామసుధ, గౌడపాదీయ కారికలు అనే ఎనిమిది పుస్తకాలను పరిచయం చేస్తూ కబీర్ భక్తితత్త్వాన్ని అవగతం చేసుకోడానికి పరమయ్యగారి పుస్తకం ఉత్తమ పరికరమని చెప్పవచ్చునంటారు.

'ముగింపుకి కాస్త ముందు' పరమయ్యగారి గ్రంథాల నేపథ్యంతో చెప్పుకున్నవి కాకుండా, తనకు తట్టిన విషయాలను, పరమయ్యగారి రచనలోని కొన్ని మెరుపులను వివరించారు. సమదర్శనం గల కవిగా, సమయోచిత భాషను పరమయ్యగారు ఎలా ఉపయోగించారో సోదాహరణంగా వివరించారు. పరమయ్యగారి అనువాదాలు కొంత ప్రత్యేకమైనవంటారు. ఏదో ఒకటి వ్రాయాలని వ్రాసినవి కావు... ప్రతి పదంలో ఔన్నత్యం, లోతూ జమిలిగా కనిపిస్తాయంటారు. శరణాగతినే కాంక్షించిన కవిగా పరమయ్యగారి నిలువెత్తు సాహిత్య మూర్తిమత్త్వాన్ని మన కనుల ముందట ప్రత్యక్షం గావించారు. ఈ విధంగా లోకానికే కాదు, సాహితీ లోకానికి కూడ అంతగా తెలియని పరమయ్యగారిని అద్భుతంగా ఎరుకపరిచినందుకు మణిబాబుకు ధన్యవాదాలు, అభినందనలు.

-మాకినీడి సూర్యభాస్కర్

ది.08-12-2020

పరమము

(శ్రీ మధునాపంతుల వేంకట పరమయ్య సాహిత్య జీవితం)

బసవరాజు అప్పారావుగారి కవిత్వాన్ని గూర్చి చెబుతూ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు "అప్పారావు కవిత్వం వల్ల ఏమి ప్రయోజనం అంటే ఏమిచెప్పను? అతని కావ్యాలన్నీ చదివాక నిట్టూర్పు విడువకుండా, కన్నీటితో చెక్కులు తడియకుండా ఉండలేము. ఆ కన్నీటికెంతటిశక్తి ఉంది? ధూళీ దూగరా లేకుండా శుభ్రంగా, శాంతంగా, సుందరంగా, వాన వెలిసిన తరువాత చెట్టులాగా, చల్లని ఆవేశంతో రవంత ఊగుతూ నిలబడతాము" అంటారు. పరమయ్యగారి గ్రంథాలూ అంతే. శుభ్రంగా, శాంతంగా, సుందరంగా ఉంటూ చల్లని ఆవేశంతో ఊగేలా చేస్తాయ్.

నిష్కామకర్మగా సాహితీ వ్యాసంగం సాగించిన ఇలాంటి మహనీయుల పుస్తకాలను గర్భగుడిలోని మూలవిరాట్ స్వరూపాన్ని చూస్తున్నట్టు నిర్మలమైన కళ్ళతో దర్శించాలి, చేతులు జోడించి. కాసేపటికి అలౌకిక ఆనందంతో అసంకల్పితంగా ఆ చేతులు కళ్ళనుండి చెంపల దాకా జారాలి.

***

పరాతత్త్వ అన్వేషణలో, పరమయ్యగారి పయనంలో
జిజ్ఞాస దారి దీపమైంది
పూర్వకవుల మార్గదర్శనముంది
అందుకే, అడుగులు కొన్ని పద్యాలైనాయ్
ఆ పద్యాలు గ్రంథాలై సాధనామార్గపు మైలురాళ్ళుగా నిలిచాయ్.

అక్కడ కాసేపు మజిలీ చేద్దాం, వారు పొంది మన ముందుంచిన దానిలో కొంత అందుకునే ప్రయత్నం చేద్దాం.

– అవధానుల మణిబాబు